www.prajanaava.in

Telugu Daily

# ప్రజానావ

ప్రతి అక్షరం జనం కోసం..

పేజీలు : 8 | వెల రూ.5.00

ప్రజానావ
ప్రతి అక్షరం జనం కోసం..
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
తెలుగు రాష్ట్రాల్లో శరవేగంగా అభివృద్ధి చెందుతున్న
ప్రజానావ దినపత్రికలో అతి తక్కువ ధరకే ప్రకటనలివ్వండి!
వివరాలకు ఈ క్రింది ఫోన్ నెంబర్లను సంప్రదించగలరు.
: 99484 33277 / 7288825681

Published from: Hyderabad, Karimnagar, Circulated to : Warangal, Khammam, Nalgonda, Mahabubnagar, Nizamabad

కరీంనగర్ | సంపుటి : 03 | సంచిక : 278 | బుధవారం | 3 జూన్, 2026



## తెలంగాణ మీ అయ్య జాగీరా?

- రాష్ట్రాన్ని విభజించిన తీరును మాత్రమే నేను వ్యతిరేకించా
- కబ్జా చేసినట్లు తేలితే నా ఫామ్ హౌస్ ప్రభుత్వానికే రాసిస్తా
- స్థానిక నేతలపై విరుచుకుపడ్డ ఏపీ డిప్యూటీ సీఎం పవన్
- సభకు అనుమతి నిరాకరించిన హైకోర్టు.. ఇంట్లోనే ప్రెస్ మీట్

తెలంగాణలో జనసేన కచ్చితంగా పోటీ చేస్తుందని ఆ పార్టీ అధినేత, ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కుండబద్దలు కొట్టారు. నవ నిర్మాణ సభకు హైకోర్టు అనుమతి నిరాకరించడంతో.. జూబ్లీహిల్స్ లోని తన నివాసంలోనే ఆయన విలేకరులతో మాట్లాడారు. బెదిరింపులకు భయపడే ప్రసక్తే లేదని, ఆంధ్రా వారిని తిడుతూ ఇంకెన్నాళ్లు కాలక్షేపం చేస్తారని ఘాటుగా ప్రశ్నించారు. అంతకుముందు రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు.

3



## పోరాట స్ఫూర్తికి తెలంగాణ ప్రతీక!

రాష్ట్ర ప్రజలకు ప్రధాని మోదీ శుభాకాంక్షలు

ఎక్స్ వేదికగా ప్రత్యేక సందేశం



2

# నిరుద్యోగులకు గుడ్ న్యూస్



### ఈ నెలలోనే విద్యా, అటవీ, పోలీస్ శాఖల్లో నోటిఫికేషన్లు

### ఇప్పటికే 67 వేలకు పైగా ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ

### అద్దె ఇళ్ల బాధల నుంచి పేదలకు విముక్తి చేస్తాం

- విజన్-2047 లక్ష్యం దిశగా ముందడుగు
- ఏ రాష్ట్రంలోనూ లేని విధంగా సంక్షేమ పథకాలు
- తొలి ఏడాదే రైతుల ఖాతాల్లో రూ. 22 వేల కోట్లు జమ
- మహిళలను కోటీశ్వరులుగా చేసేందుకు ప్రత్యేక ప్రణాళికలు
- తెలంగాణలో రాచరికానికి, పెత్తందారీ వ్యవస్థకు చోటు లేదు
- పరేడ్ గ్రౌండ్స్ అవతరణ వేడుకల్లో సీఎం రేవంత్ రెడ్డి

తెలంగాణ అవతరణ దినోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి ఏ రేవంత్ రెడ్డి నిరుద్యోగులకు తీపి కబురు అందించారు. ఈ నెలలోనే విద్యా, అటవీ, పోలీసు శాఖల్లో భారీగా ఉద్యోగ ప్రకటనలు విడుదల చేస్తామని ప్రకటించారు. పదేళ్ల రాచరిక పాలనకు చరమగీతం పాడి, ప్రజాకాంక్షల ప్రభుత్వంగా ఏర్పడిన తమ పాలనలో సంక్షేమం, అభివృద్ధికి సమ ప్రాధాన్యం ఇస్తున్నట్లు స్పష్టం చేశారు. సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్ లో మంగళవారం అత్యంత వైభవంగా జరిగిన రాష్ట్ర ఆవిర్భావ వేడుకల్లో ఆయన ప్రసంగించారు. రైతులకు రుణ విముక్తి, పేదలకు ఇందిరమ్మ ఇళ్లు, మహిళల సాధికారత లక్ష్యంగా అడుగులు వేస్తూ.. విజన్-2047 దిశగా రాష్ట్రాన్ని దేశానికే ఆదర్శంగా తీర్చిదిద్దుతామని ఆయన ఉద్ఘాటించారు.



వివరాలు 2వ పేజీలో



3

## ఇది ప్రజల జాగీరు.. మీ అయ్యది కాదు

- పవన్ కల్యాణ్ వ్యాఖ్యలపై భగ్గుమన్న మంత్రి పొన్నం ప్రభాకర్
- ముందుగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్



3

## 91 మంది ఖైదీలకు క్షమాభిక్ష

వారి ఉపాధికి తోడ్పాటు అందిస్తామన్న జైళ్లశాఖ డీజీ



## కాంగ్రెస్‌కు తిరుగు లేదు!

వచ్చే ఎన్నికల్లో మాకు ప్రత్యర్థులే లేరు

ధాన్యం కొనుగోళ్ల వైఫల్యం బీజేపిదే

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

వివరాలు 2వ పేజీలో

## సంక్షేమం నుంచి సంక్షోభంలోకి..

పుష్కర తెలంగాణ కాస్తా ముష్కర తెలంగాణ ▪ తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ నేత కేటీఆర్

3






## ఆర్అండ్‌బీలో 222 ఇంజినీర్ పోస్టులు

- నోటిఫికేషన్ విడుదల చేసిన టీజీపీఎస్సీ
- జూన్ 18 నుంచి ఆన్ లైన్ లో దరఖాస్తుల స్వీకరణ
- ఆగస్టు 10 నుంచి రాత పరీక్షలు


## అమరుల త్యాగఫలమే తెలంగాణ రాష్ట్రం

- దశాబ్దాల పోరాటాలకు ప్రతీక మన రాష్ట్రం
- జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన గవర్నర్ శివ ప్రతాప్
- ఐటీ, ఫార్మా రంగాల్లో మనకు అంతర్జాతీయ గుర్తింపు
- లోక్ భవన్ లో ఘనంగా ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



## తీవ్రస్థాయికి ఉద్రిక్తతలు

- కొలిక్కిరాని దౌత్యపరమైన ప్రయత్నాలు
- చర్చలు నిలిపేస్తున్నామని ఇరాన్ ప్రకటన
- 'హార్ముజ్' జలసంధిని పూర్తిగా మూసివేత!



4

## భారత్‌లో ఎబోలా టెన్షన్

- ఒక కొత్త స్ట్రెయిన్ వేగంగా వ్యాప్తి
- అప్రమత్తమైన భారత ప్రభుత్వం




4

## మరో రికార్డు దిశగా మోడీ

- 7 రోజుల్లో నెహ్రూ రికార్డుకు బ్రేక్
- అత్యధిక కాలం ప్రధానిగా కొత్త చరిత్ర
- 10న ఎన్డీఏ ముఖ్యమంత్రుల సమావేశం
- చంద్రబాబు ప్రవేశపెట్టనున్న తీర్మానం
- 9 వేల రోజుల పాలనా నాయకత్వానికి చేరువైన మోడీ



4

# పోరాట స్ఫూర్తికి తెలంగాణ ప్రతీక!

## రాష్ట్ర ప్రజలకు ప్రధాని మోదీ శుభాకాంక్షలు

### ఎక్స్ వేదికగా ప్రత్యేక సందేశం పంచుకున్న ప్రధానమంత్రి

**న్యూఢిల్లీ:** తెలంగాణ రాష్ట్ర పన్నెండవ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రాష్ట్ర ప్రజలకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. వికసిత భారత్ సంకల్పాన్ని సాకారం చేయడంలో భాగంగా.. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి ప్రస్థానానికి, ప్రగతి పథానికి కేంద్ర ప్రభుత్వం ఎల్లప్పుడూ పూర్తి మద్దతునిస్తుందని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు. ఎక్స్ వేదికగా ప్రధాని మోదీ తెలంగాణ ప్రజలను ఉద్దేశించి ఒక ప్రత్యేక సందేశాన్ని పంచుకున్నారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా తెలంగాణ ప్రజలకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలుపుతున్నట్లు మోదీ తన సందేశంలో పేర్కొన్నారు. తెలంగాణ ప్రజలు తమ సృజనాత్మకతకు, వ్యాపార దృక్పథానికి ప్రసిద్ధులని కొనియాడారు. ఈ రాష్ట్రం ధైర్యానికి, సంకల్పానికి, పోరాట స్ఫూర్తికి ప్రతీకగా నిలిచిన గొప్ప చరిత్ర, వైభవోపేతమైన సంస్కృతిని కలిగి ఉందని ఉద్ఘాటించారు. వికసిత భారత్ అనే మన స్వప్నాన్ని సాకారం చేసే దిశగా తెలంగాణ అభివృద్ధి ప్రస్థానానికి కేంద్ర ప్రభుత్వం సంపూర్ణ సహకారం అందించడానికి కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రజలందరికీ మంచి ఆరోగ్యం, సుఖసంతోషాలు, విజయాలు కలగాలని ప్రార్థిస్తున్నట్లు పేర్కొన్నారు.



### దేశ కీర్తిని పెంచాలి..: అమిత్ షా

కేంద్ర హోంమంత్రి అమిత్ షా కూడా తెలంగాణ ప్రజలకు రాష్ట్ర అవతరణ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. విశిష్టమైన సంస్కృతి, అద్భుతమైన పారిశ్రామిక నైపుణ్యంతో దేశ గమనంలో తెలంగాణ కీలక పాత్ర పోషిస్తోందని ప్రశంసించారు. తెలంగాణ ప్రజల ఉత్సాహభరితమైన సంస్కృతి, వారి అద్భుతమైన పారిశ్రామిక స్ఫూర్తితో రాష్ట్రం రాబోయే రోజుల్లో మరిన్ని ఉన్నతమైన ప్రగతి శిఖరాలను, సంపదను సాధించి దేశ కీర్తి ప్రతిష్టలను మరింత ఇనుమడింపజేయాలని ఆయన ఆకాంక్షించారు. ఈ రాష్ట్రం మరిన్ని ప్రగతి శిఖరాలను అధిరోహిస్తూ, భారతదేశ కీర్తి ప్రతిష్టలను మరింత గొప్పస్థాయికి తీసుకెళ్లాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షిస్తున్నానని, జై తెలంగాణ అంటూ తన సందేశాన్ని ముగించారు. కాగా, రెండు వేల పద్నాలుగు జూన్ రెండున ఆంధ్రప్రదేశ్ వాయువ్య ప్రాంతం నుండి విడిపోయి, సుదీర్ఘ ప్రజాస్వామ్య పోరాటాల ఫలితంగా భారతదేశంలో సరికొత్త రాష్ట్రంగా తెలంగాణ అవతరించిన సంగతిని ఈ సందర్భంగా జాతీయ మీడియా గుర్తుచేసింది.

# అమరుల త్యాగఫలమే తెలంగాణ

- దశాబ్దాల పోరాటాలకు ప్రతీక మన రాష్ట్రం
- జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా
- ఐటీ, ఫార్మా రంగాల్లో మనకు అంతర్జాతీయ గుర్తింపు
- లోక్ భవన్ లో ఘనంగా ఆవిర్భావ దినోత్సవ వేడుకలు




**ప్రజానావ, హైదరాబాద్:** అమరవీరుల త్యాగాలకు, దశాబ్దాల ప్రజాస్వామ్య పోరాటాలకు ప్రతీక తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం అని రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా అన్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా మంగళవారం లోక్ భవన్ లో గవర్నర్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. తెలంగాణ ఉద్యమంలో ప్రాణత్యాగం చేసిన అమరవీరులకు ఆయన ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రజలందరికీ, ప్రపంచవ్యాప్తంగా నివసిస్తున్న తెలంగాణ బిడ్డలందరికీ గవర్నర్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా గవర్నర్ ప్రసంగించారు. ఆధునిక తెలంగాణ నిర్మాణానికి పునాదులు వేసిన ప్రతి ఒక్కరినీ ఈ సందర్భంగా స్మరించుకోవాలని పిలుపునిచ్చారు. 'జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసీ' అనే సూక్తిని ప్రస్తావిస్తూ.. జన్మభూమి స్వర్గం కంటే గొప్పదని పేర్కొన్నారు. తెలంగాణ శతాబ్దాల నాటి సంస్కృతి, సంప్రదాయాలు, గ్రామీణ వ్యవసాయ వారసత్వం రాష్ట్ర అసలైన జీవనాడిగా నిలిచాయని అన్నారు. కాకతీయుల కాలం నాటి గొలుసుకట్టు చెరువుల నుంచి నేటి ఆధునిక సాగునీటి ప్రాజెక్టుల వరకు రైతాంగం చేసిన కృషి తెలంగాణను సస్యశ్యామలం చేసిందని గవర్నర్ కొనియాడారు. వ్యవసాయ రంగంతో పాటు ఐటీ, ఫార్మా, స్టార్టప్ తదితర రంగాల్లో తెలంగాణ అంతర్జాతీయ గుర్తింపు సాధించడం గర్వకారణమని ఆయన పేర్కొన్నారు. రాజ్యాంగ విలువలు, 'సర్వే భవంతు సుఖినః' అనే ఆదర్శ స్ఫూర్తితో గ్రామీణాభివృద్ధి, పట్టణాభివృద్ధి, అన్ని వర్గాల సంక్షేమం, నగరాల ఆధునికీకరణ సమపాళ్లలో సాగుతూ సుసంపన్న తెలంగాణ నిర్మాణం జరగాలని ఆకాంక్షించారు. తెలంగాణ రాష్ట్రం మరింత అభివృద్ధి సాధించి దేశ ప్రగతిలో కీలక పాత్ర పోషించాలని గవర్నర్ ఆకాంక్షించారు. వేడుకల్లో గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం దాన కిషోర్, సంయుక్త కార్యదర్శి శశికిరణా చారి, లోక్ భవన్ అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.



# నిరుద్యోగులకు గుడ్‌న్యూస్

- ఈ నెలలోనే విద్యా, అటవీ, పోలీస్ శాఖల్లో నోటిఫికేషన్లు
- ఇప్పటికే 67 వేలకు పైగా ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ
- అద్దె ఇళ్ల బాధల నుంచి పేదలకు విముక్తి కల్పిస్తాం
- విజన్-2047 లక్ష్యం దిశగా ముందడుగు
- రాచరికాన్ని సహించం.. తెలంగాణలో పెత్తందారీ వ్యవస్థకు చోటు లేదు
- పరేడ్ గ్రౌండ్స్ అవతరణ వేడుకల్లో సీఎం రేవంత్ రెడ్డి



**ప్రజానావ, హైదరాబాద్:** తెలంగాణ అవతరణ దినోత్సవం సందర్భంగా నిరుద్యోగ యువతకు సీఎం రేవంత్ రెడ్డి గుడ్ న్యూస్ చెప్పారు. త్వరలోనే పలు జాబ్ నోటిఫికేషన్లను టీజీపీఎస్సీ విడుదల చేస్తుందని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో సంక్షేమానికి, అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం సమ ప్రాధాన్యం ఇస్తోందని స్పష్టం చేశారు. దేశంలో ఏ రాష్ట్రంలోనూ లేని విధంగా ఇక్కడ సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్ లో వైభవంగా నిర్వహించిన తెలంగాణ ఆవిర్భావ వేడుకల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రజలకు తెలంగాణ అవతరణ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. రాచరికాన్ని, పెత్తనాన్ని తెలంగాణ సమాజం ఎప్పటికీ సహించదన్నారు. ప్రత్యేక తెలంగాణ కల సాకారం చేసిన నాటి ప్రధాని మన్మోహన్ సింగ్, సోనియా గాంధీలకు ఈ సందర్భంగా ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ వేడుకల్లో భాగంగా విధులు అత్యుత్తమంగా నిర్వహించిన పలువురు పోలీసు అధికారులకు రేవంత్ రెడ్డి చేతుల మీదుగా విశిష్ట సేవా పురస్కారాలను ప్రదానం చేశారు. "పుట్టుక నీది, చావు నీది.. బతుకంతా దేశానిది" అన్న ప్రజాకవి కాళోజీ నారాయణరావు మాటలను రేవంత్ రెడ్డి ఈ సందర్భంగా స్మరించుకున్నారు. కాళోజీ స్ఫూర్తితోనే తాము అధికారం చేపట్టిన నాటి నుంచి రాష్ట్ర ప్రజల హితం కోసం నిరంతరం శ్రమిస్తున్నామని, తమది ప్రజల ఆకాంక్షలను నెరవేర్చే ప్రభుత్వం అని అన్నారు. గత ఆరు నెలల తమ పాలనలో ప్రజా సంకల్పాన్ని నిజం చేయడంలో విజయవంతం అయినట్లు పేర్కొన్నారు. తెలంగాణ విజన్-2047 లక్ష్యాన్ని సాధించే దిశగా అడుగులు వేస్తున్నామని, రాబోయే రోజుల్లో రాష్ట్ర రైతులను వ్యవసాయ పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దుతామని ఈ వేదికగా హామీ ఇచ్చారు. ఎలాంటి న్యాయపరమైన సమస్యలు లేకుండా, అత్యంత పారదర్శకంగా ఇప్పటివరకు 67 వేలకు పైగా ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేశామన్నారు. ఈ సందర్భంగా నిరుద్యోగులకు ముఖ్యమంత్రి శుభవార్త అందించారు. ఈ నెలలోనే టీజీపీఎస్సీ ద్వారా ఇంజనీరింగ్, పీసీబీ, అటవీశాఖ, టౌన్ ప్లానింగ్, విద్యాశాఖల్లో ఖాళీలకు ఉద్యోగ నోటిఫికేషన్లు విడుదల చేస్తామని ప్రకటించారు. ఉద్యోగాల నోటిఫికేషన్ల జారీ ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని హామీ ఇచ్చారు. విద్యా రంగంలో భాగంగా ఇప్పటికే 1,362 ప్రభుత్వ పాఠశాలల్లో ప్రీ-ప్రైమరీ క్లాసులు ప్రారంభించామన్నారు. ఈ ఏడాది నుంచి అన్ని ప్రభుత్వ విద్యాసంస్థల్లో ఉదయం బ్రేక్ ఫాస్ట్ అందిస్తున్నామని, త్వరలోనే జూనియర్ కాలేజీ విద్యార్థులకు కూడా మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేస్తామని తెలిపారు. పేదలకు సొంతింటి కలను సాకారం చేయడం తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని సీఎం స్పష్టం చేశారు. అద్దె ఇళ్ల బాధలు, కష్టాల నుండి పేదలకు విముక్తి కలిగించేందుకు గత ఐదు నెలల కాలంలో 1.25 లక్షల ఇందిరమ్మ ఇళ్లను నిర్మించగా, ఇందుకోసం రూ. 22 వేల కోట్లు ఖర్చు చేశామని ఆయన తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరంలో మరో 3.50 లక్షల ఇళ్లను మంజూరు చేయగా, ఈసారి క్యూఆర్ పరిధిలో లక్ష ఇందిరమ్మ ఇళ్లను నిర్మిస్తామని చెప్పారు. కొత్త రేషన్ కార్డులను కూడా పంపిణీ చేసి ప్రజల సమస్యలకు పరిష్కారం చూపామన్నారు. సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేసేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని సీఎం తెలిపారు. జలయజ్ఞంలో చేపట్టిన ప్రాజెక్టులు పదేళ్లకు పైగా పెండింగ్ లో ఉన్నాయని, తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు నిర్మాణానికి మళ్లీ కృషి చేస్తున్నామని చెప్పారు. రూ. లక్ష కోట్లతో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు మూడేళ్లకే కూలిందని ఆరోపించారు. ప్రాజెక్టుకు మరమ్మతులు చేసేందుకు ప్రయత్నిస్తున్నట్లు చెప్పారు. ఒకేసారి రూ. 2 లక్షల వరకు రుణమాఫీ చేసి రైతులను రుణ విముక్తి చేశామన్నారు. తొలి ఏడాదే రైతుల ఖాతాల్లో రూ. 22 వేల కోట్లు జమ చేసినట్లు చెప్పారు. రైతుల పంటలు చివరి గింజ వరకు కొనేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఇప్పటికే రైతుల ఖాతాల్లో ధాన్యం డబ్బు రూ. 11,300 కోట్లు జమ చేశామని తెలిపారు. మహిళలను కోటీశ్వరులుగా చేసేందుకు ప్రణాళికలు వేస్తున్నట్లు ముఖ్యమంత్రి తెలిపారు. మహిళా సంఘాలకు రూ. 60 వేల కోట్ల సున్నా వడ్డీ రుణాలు ఇచ్చామని చెప్పారు. ఉచిత బస్సు ప్రయాణం ద్వారా మహిళలు రూ. 10 వేల కోట్లు ఆదా చేసుకున్నారన్న ముఖ్యమంత్రి, 53.90 లక్షల కుటుంబాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ ఇస్తున్నామని గుర్తుచేశారు. తెలంగాణ అవతరణ దినోత్సవ వేడుకలు రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా జరిగాయి. పరేడ్ గ్రౌండ్స్ లో రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకల కోసం రాష్ట్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేసింది. సీఎం రేవంత్ రెడ్డి ముందుగా అసెంబ్లీ సమీపంలోని గన్ పార్క్ వద్ద అమరవీరుల స్తూపానికి నివాళులు అర్పించారు. అనంతరం సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్ లో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి తెలంగాణ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాల్లో సంబంధిత మంత్రులు జాతీయ జెండా ఆవిష్కరించారు. ఖమ్మంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, హనుమకొండలో రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, నల్గొండలో రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తదితరులు జాతీయ జెండా ఆవిష్కరించి వేడుకల్లో పాల్గొన్నారు. రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా రాత్రి వేళల్లో హైదరాబాద్ లోని సచివాలయం, అసెంబ్లీ భవనాలను విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు.

# కాంగ్రెస్‌కు తిరుగు లేదు!

- వచ్చే ఎన్నికల్లో మాకు ప్రత్యర్థులే లేరు
- రాష్ట్ర అభివృద్ధికి కేబినెట్ అంతా ఒక్క జట్టుగా పనిచేస్తోంది
- ధాన్యం కొనుగోళ్ల వైఫల్యం బీజేపీదే
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

**ప్రజానావ, ఖమ్మం:** వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ప్రత్యర్థులే లేరని తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వ్యాఖ్యానించారు. తెలంగాణ అవతరణ వేడుకల అనంతరం ఆయన మీడియాతో చిట్ చాట్ గా మాట్లాడారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం ప్రస్తుత మంత్రివర్గం ఒక జట్టులా అద్భుతంగా పనిచేస్తోందని తెలిపారు. అందరి లక్ష్యం రాష్ట్ర అభివృద్ధి మాత్రమేనని, క్షేత్రస్థాయిలో పని చేసే పార్టీలకు ఎలాంటి ఆర్భాటపు ప్రచారాలు అవసరం లేదన్నారు. అసెంబ్లీ, లోక్ సభ, మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ తన సత్తా చాటుకుందని గుర్తు చేశారు. జర్నలిస్టుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. వారికి ఇళ్ల స్థలాలు, ఇళ్లు కేటాయించే అంశంపై సానుకూలంగా ఉన్నామన్నారు. జర్నలిస్టుల ఇళ్ల సమస్య పరిష్కారం కోసం ప్రత్యేకంగా అధికారులు పనిచేస్తున్నారని, దీనిపై ప్రభుత్వం సీరియస్ గా పరిశీలిస్తోందని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రంలో రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం అత్యంత అద్భుతంగా నడుస్తోందని భట్టి విక్రమార్క తెలిపారు. ప్రజలందరూ ఈ ఉచిత వైద్య సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ పథకం సజావుగా సాగడం కోసం ప్రభుత్వం ప్రతి నెలా రూ. 150 కోట్ల నిధులను కేటాయిస్తోందని వెల్లడించారు. ఈ పథకం ద్వారా పేదలకు రూ. 10 లక్షల వరకు వైద్య బీమా కవరేజీ లభిస్తుందన్నారు. వైద్య సేవలను మరింత బలోపేతం చేయడానికి వీలుగా సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రుల్లో కొత్తగా పది వేల పడకలను పెంచుతున్నట్లు ఆయన ప్రకటించారు. ప్రతిష్టాత్మకంగా తీసుకువస్తున్న ఇందిరమ్మ జీవిత బీమా పథకం కూడా లబ్ధిదారులకు ఎంతో ప్రయోజనకరంగా మారుతుందని భరోసా ఇచ్చారు. ధాన్యం కొనుగోళ్లపై కేంద్రంలోని బీజేపి ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరును డిప్యూటీ సీఎం తప్పుబట్టారు. బీజేపి నాయకులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ లపై ఆయన విరుచుకుపడ్డారు. కేంద్రంలో ఉన్న బీజేపి ప్రభుత్వం పూర్తిగా రైతు వ్యతిరేక ప్రభుత్వమని ధ్వజమెత్తారు. దేశంలో మొదటి నుండి గోదాముల్లో స్టాక్ ఉంచడం నేరమైనప్పటికీ, కేంద్ర ప్రభుత్వం మాత్రం అదానీ, అంబానీ లాంటి పెద్ద కార్పొరేట్ సంస్థలకు గోదాములు పెట్టుకునేలా లబ్ధి చేకూర్చిందని ఆరోపించారు. ఇక్కడి బీజేపి నేతలు రాజకీయాలు మాట్లాడటం మానేసి, కేంద్రం ద్వారా ధాన్యం కొనుగోళ్లు జరిగేలా చూడాలని డిప్యూటీ సీఎం గట్టిగా హితవు పలికారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ ఎస్ ఆర్) పై మీడియా దృష్టి పెట్టాలని భట్టి విక్రమార్క సూచించారు. ఓట్లు గల్లంతు కాకుండా చూసుకోవాలని, ప్రతి ఒక్కరూ ఓటర్ల మ్యాపింగ్, అన్ మ్యాపింగ్ ప్రక్రియలపై అప్రమత్తంగా ఉండాలని తెలిపారు.



రైతుల మోటార్లకు ఎట్టి పరిస్థితుల్లోనూ కరెంటు మీటర్లు పెట్టబోమని, ఉచిత విద్యుత్ అందించి తీరుతామని ముఖ్యమంత్రి చేసిన ప్రకటనపై ప్రతిపక్షాలు నోరు మెదపకపోవడమే భవిష్యత్తులో తమ విజయానికి నిదర్శనమన్నారు. ఇదే ఊపుతో రాబోయే జిల్లా పరిషత్ ఎన్నికలపై కూడా ప్రభుత్వం త్వరలోనే నిర్ణయం తీసుకుంటుందని, 2028లో జరిగే తదుపరి అసెంబ్లీ ఎన్నికల్లో తమకు ప్రత్యర్థులే ఎవరూ లేరని ధీమా వ్యక్తం చేశారు.

# ఆర్అండ్‌బీలో 222 ఇంజనీర్ పోస్టులు

- నోటిఫికేషన్ విడుదల చేసిన టీజీపీఎస్సీ
- జూన్ 18 నుంచి ఆన్ లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ
- ఆగస్టు 10 నుంచి రాత పరీక్షలు




**ప్రజానావ, హైదరాబాద్:** తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) నిరుద్యోగులకు మరో కీలక నోటిఫికేషన్ విడుదల చేసింది. ముఖ్యంగా ఇంజనీరింగ్ విద్యార్హత కలిగిన అభ్యర్థులకు ఇది మంచి అవకాశంగా మారనుంది. రోడ్లు, భవనాల శాఖలో మొత్తం 222 ఖాళీల భర్తీకి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ నోటిఫికేషన్ లో భాగంగా 49 అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పోస్టులు, 19 ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ పోస్టులను భర్తీ చేయనున్నారు. అర్హులైన అభ్యర్థుల నుంచి జూన్ 18 నుంచి ఆన్ లైన్ దరఖాస్తులను స్వీకరించనున్నారు. ఏఈఈ పోస్టులకు జూలై 13 వరకు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉండగా.. ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ పోస్టులకు జూలై 15 వరకు గడువు కల్పించారు. అభ్యర్థులు అధికారిక నోటిఫికేషన్ లో పేర్కొన్న అర్హతలు, వయోపరిమితి, ఇతర నిబంధనలను పరిశీలించి దరఖాస్తు చేసుకోవాలని అధికారులు సూచించారు. నియామక ప్రక్రియలో భాగంగా రాత పరీక్షలను ఆగస్టు 10 నుంచి 17 వరకు నిర్వహించనున్నారు. పరీక్షల్లో ప్రతిభ కనబర్చిన అభ్యర్థులను తుది ఎంపికకు పరిగణనలోకి తీసుకుంటారు. పూర్తి వివరాల కోసం అభ్యర్థులు కమిషన్ అధికారిక నోటిఫికేషన్ ను పరిశీలించాలని సూచిస్తున్నారు.

# తెలంగాణ ఎవరి జాగీరు కాదు!

- ఆంధ్రా వాళ్లను తిడుతూ ఇంకెన్నాళ్లు కాలక్షేపం చేస్తారు?
- రాష్ట్రాన్ని విభజించిన తీరును మాత్రమే నేను వ్యతిరేకించా
- కబ్జా చేసినట్లు తేలితే నా ఫామ్ హౌస్ ప్రభుత్వానికే రాసిస్తా
- స్థానిక నేతలపై విరుచుకుపడ్డ ఏపీ డిప్యూటీ సీఎం పవన్
- సభకు అనుమతి నిరాకరించిన హైకోర్టు.. ఇంట్లోనే ప్రెస్ మీట్



**ప్రజానావ, హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జనసేన అధినేత, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఎక్స్ వేదికగా ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. మరోవైపు హైదరాబాద్ లో జనసేన తలపెట్టిన నవ నిర్మాణ సభకు హైకోర్టు అనుమతి నిరాకరించడంతో జూబ్లీహిల్స్ లోని ఆయన నివాసం వద్ద ఉద్రిక్తత నెలకొంది. ఈ పరిణామాల నేపథ్యంలో ఇంట్లోనే మీడియాతో మాట్లాడిన పవన్ కల్యాణ్.. తెలంగాణలో జనసేన కచ్చితంగా పోటీ చేస్తుందని ప్రకటించారు. తనను ఎవరైనా బెదిరించాలని చూస్తే భయపడేది లేదని ఘాటుగా హెచ్చరించారు.

### నవ నిర్మాణ సభకు హైకోర్టు బ్రేక్..

తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా హైదరాబాద్ లో నవ నిర్మాణ సభ పేరుతో బహిరంగ సభ నిర్వహించాలని జనసేన భావించింది. భద్రత, ట్రాఫిక్ కారణాల దృష్ట్యా పోలీసులు అనుమతి నిరాకరించడంతో జనసేన నేతలు హైకోర్టులో హౌస్ మోషన్ పిటిషన్ వేశారు. సమయాభావం వల్ల ఇంత అకస్మాత్తుగా అత్యవసర విచారణ జరపలేమని న్యాయస్థానం ఆ పిటిషన్ ను కొట్టివేసింది. దీంతో సభకు బ్రేక్ పడింది. మరోవైపు పవన్ ఇంటి వద్దకు అభిమానులు, కార్యకర్తలు భారీగా చేరుకోవడంతో పోలీసులు వారిని అడ్డుకున్నారు. ప్రభుత్వానికి, పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు చేయడంతో అక్కడ కాసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది.

### ఎక్స్ లో శుభాకాంక్షలు..

అంతకుముందు పవన్ కల్యాణ్ ఎక్స్ వేదికగా తెలంగాణ ప్రజలకు శుభాకాంక్షలు చెప్పారు. "నా తెలంగాణ కోటి రతనాల వీణ" అని దాశరథి కృష్ణమాచార్య పలికిన అక్షర సత్యం స్వేచ్ఛా గీతమై మోగిన రోజు ఇదని గుర్తుచేశారు. సకల జనుల సంకల్పం, అమరుల త్యాగాల రూపమే తెలంగాణ అని కొనియాడారు. జనసేన ఊపిరి పోసుకున్నది ఈ గడ్డపైనే అని, అణగారిన వర్గాల కోసం గళం వినిపించే తెగువ తెలంగాణ నేలకే ఉందని స్పష్టం చేశారు. ఐటీ, ఫార్మా, వ్యవసాయ రంగాల్లో రాష్ట్రం మరింత అభివృద్ధి చెందాలని, ఆ అభివృద్ధి ఫలాలు అట్టడుగు వర్గాలకు చేరాలని ఆయన ఆకాంక్షించారు.

### బెదిరిస్తే భయపడేది లేదు..

తన నివాసంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో పవన్ కల్యాణ్ మాట్లాడుతూ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. తెలంగాణలో జనసేన ఉంటుందని, ఇక్కడ కచ్చితంగా పోటీ చేస్తామని కుండబద్దలు కొట్టారు. తెలంగాణ ఎవరి జాగీరు కాదని, తాటాకు చప్పుళ్లకు తాను భయపడనని తేల్చి చెప్పారు. భయపడేవాడినే అయితే పార్టీ ఎందుకు పెడతానని ప్రశ్నించారు. తనకు తెలంగాణపై ఉన్న ప్రేమ రాజకీయాలకు అతీతమన్నారు. ఆంధ్రా వాళ్లను ఇంకెంత కాలం తిడుతూ కాలక్షేపం చేస్తారని స్థానిక నేతలను నిలదీశారు. తన ఫామ్ హౌస్ ను కబ్జా చేసి కట్టానని నిరూపిస్తే.. దాన్ని రాష్ట్ర ప్రభుత్వానికే రాసిస్తానని సవాల్ విసిరారు.

### విభజన తీరుకే వ్యతిరేకం..

తెలంగాణ ఏర్పాటుకు తాను ఎన్నడూ వ్యతిరేకం కాదని, పార్లమెంటు తలుపులు మూసి రాష్ట్రాన్ని విభజించిన తీరును మాత్రమే నాడు వ్యతిరేకించానని పవన్ కల్యాణ్ వివరించారు. తెలంగాణను వ్యతిరేకించిన వారే ఇప్పుడు రాష్ట్రంలో ఎమ్మెల్యేలుగా ఉన్నారని విమర్శించారు. తెలంగాణకు ద్రోహం జరిగితే తొలి గళం వినిపించేది జనసేన పార్టీనే అని స్పష్టం చేశారు. ప్రజాకవి గద్దర్ తో తనకు ఎంతో సాన్నిహిత్యం ఉందని, ఆయన బతికున్నప్పుడు ఇప్పుడు మాట్లాడుతున్న నేతలంతా ఎక్కడ ఉన్నారని ప్రశ్నించారు. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డిపై తనకు పూర్తి గౌరవం ఉందన్నారు. ఒక రాజకీయ విశ్లేషకుడు తన గురించి తప్పుగా మాట్లాడటం వల్లే ఈ వివాదమంతా మొదలైందని ఆయన స్పష్టం చేశారు.

# ఇది ప్రజల జాగీరు.. మీ అయ్యది కాదు

- ఏపీ ఉప ముఖ్యమంత్రి వ్యాఖ్యలపై భగ్గుమన్న మంత్రి పొన్నం ప్రభాకర్
- ముందుగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్



**ప్రజానావ, హైదరాబాద్:** ఏపీ డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కల్యాణ్ వ్యాఖ్యలపై తెలంగాణ కాంగ్రెస్ నేతలు తీవ్రంగా స్పందిస్తున్నారు. "తెలంగాణ నాలుగు కోట్ల ప్రజల జాగీరు.. మీ అయ్య జాగీరు కాదు" అంటూ రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మండిపడ్డారు. మంగళవారం హైదరాబాద్ లో జనసేనాని పవన్ కల్యాణ్ చేసిన వ్యాఖ్యలపై గాంధీభవన్ వేదికగా మంత్రి స్పందించారు. పవన్ కల్యాణ్ తెలంగాణకు వచ్చి ఏం పీకుతాడని ఆయన ప్రశ్నించారు. పవన్ కల్యాణ్ ఓ పెయిడ్ ఆర్టిస్ట్ అని మంత్రి పొన్నం అభివర్ణించారు. తన దగ్గర డబ్బులు ఉంటే తాను కూడా పవన్ తో ఒక క్యారెక్టర్ చేయిస్తానన్నారు. తెలంగాణపై పవన్ కల్యాణ్ మరోసారి అక్కసు వెళ్లగక్కారంటూ మండిపడ్డారు. తెలంగాణ ఏర్పాటును వ్యతిరేకించిన వ్యక్తి పవన్ అని తెలిపారు. గద్దర్ కు కారు కొనిచ్చానని చెప్పినందుకు ముందుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. చనిపోయిన వారి గురించి మాట్లాడాల్సిన అవసరం ఏముందని ఆయన సూటిగా ప్రశ్నించారు. తమకు ఆంధ్రప్రదేశ్ లోనే దిక్కులేదని పవన్ చెప్పుకున్నాడని మంత్రి ఎద్దేవా చేశారు. ఉద్యమ సమయంలో కూడా ఆంధ్రా వాళ్లను తాము ఏమీ అనలేదని, కానీ తాము ఆంధ్రా వాళ్లను ఏమో అన్నట్లు పవన్ కల్యాణ్ అబద్ధాలు చెబుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్లమెంటులో ఏ బిల్లు చేసినా తలుపులు మూసే పాస్ చేస్తారని మంత్రి వివరించారు. కొండగట్టుకు ఇచ్చిన పైసలు పవన్ అయ్య జాగీరా అని సందేహం వ్యక్తం చేశారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం రోజు మీటింగ్ పెట్టడం రెచ్చగొట్టడం కాదా అంటూ అసహనం వ్యక్తం చేశారు. పవన్ కల్యాణ్ తిరిగితే జనాలు వస్తారు కానీ ఓట్లు వేయరని ఎద్దేవా చేశారు. ఆయన వచ్చినా, పోయినా తమకేం సంబంధం లేదన్నారు. తెలంగాణ ఎప్పుడైనా ఏపీ ప్రజలను స్వాగతిస్తూనే ఉంటుందని చెప్పారు. సినిమా నటుడిగా పవన్ ఎక్కడ తిరిగినా తమకేం ఇబ్బంది లేదన్నారు. పవన్ చేసిన వ్యాఖ్యలకు టీపీసీసీ మీడియా కమిటీ చైర్మన్ సామా రామమోహన్ రెడ్డి స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. పవన్ కల్యాణ్ ద్వంద్వ వైఖరికి ఈ వ్యాఖ్యలు అద్దం పడుతున్నాయని విమర్శలు గుప్పించారు. ఈ మేరకు ఆయన ఎక్స్ వేదికగా పోస్ట్ చేశారు. ఆంధ్రప్రదేశ్ లో పవన్ కల్యాణ్ ది జనసేన పార్టీ అని.. తెలంగాణలో బీజేపీకి భజన సేన అంటూ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. తెలంగాణలో నిరుద్యోగంపై కొట్లాడుతానని అన్న పవన్ కల్యాణ్ కు.. కేంద్ర ప్రభుత్వం కారణంగా పెరుగుతున్న ధరలు, నిరుద్యోగం, పేపర్ లీక్ ఘటనలు కనిపించడం లేదా అని నిలదీశారు. ఒకవేళ కనిపించినా నిలబడి కొట్లాడటానికి కాళ్లు లేవా అంటూ ఘాటుగా స్పందించారు. "ఇది తెలంగాణ జాతి.. అమ్మలా ఆదరించడం తెలుసు.. తెలంగాణలో కుట్రలు చేస్తే అమ్మోరులా దహించడం కూడా తెలుసు" అంటూ పవన్ కు వార్నింగ్ ఇస్తూ ఎక్స్ లో పోస్ట్ చేశారు.

# తెలంగాణ సంస్కృతిని ముందుకు తీసుకెళతాం

- అభివృద్ధికి కేంద్రం కట్టుబడి ఉంది
- ఢిల్లీలో తెలంగాణ అవతరణ వేడుకల్లో నితిన్ నబీ








**న్యూఢిల్లీ:** తెలంగాణ అభివృద్ధి, సంస్కృతిని ముందుకు తీసుకువెళ్లాలన్నది బీజేపీ సంకల్పం' అని బిజెపి జాతాయ అధ్యక్షుడు నితిన్ నబీన్ అన్నారు. తెలంగాణ అభివృద్ధికి కేంద్రం కట్టుబడి ఉంది. పీఎం కిసాన్ యోజన ,ముద్ర లోన్లు, జన్ ధన్ ఖాతాలు అందించాం. మౌలిక వసతులు,రోడ్లు,రహదారులు,రైల్వేలైన్లు ఏర్పాటు చేస్తున్నాం. వికసిత భారత్ కావాలంటే వికసిత తెలంగాణ కావాలి. ఒక అవినీతి పరుడు చేతుల్లోంచి మరో అవినీతి పరుడి చేతుల్లోకి వెళ్ళింది. తెలంగాణ కలలును సాకారం చేస్తాం' అని నితిన్ నబీన్ పేర్కొన్నారు. తెలంగాణ వ్యాప్తంగా రాష్ట్ర అవతరణ దినోత్సవ కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. అలానే కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు ఢిల్లీలో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకకు బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్, కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి, టీజీ బీజేపీ చీఫ్ రామచందర్ రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా నితిన్ నబీన్ రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ సంస్కృతి, ప్రజల పోరాట స్ఫూర్తిని కొనియాడుతూ, అభివృద్ధి పథంలో రాష్ట్రం మరింత ముందుకు సాగాలని ఆకాంక్షించారు. చిన్న రాష్ట్రాల అభివృద్ధికి బీజేపీ కట్టుబడి ఉంది. జార్ఖండ్, ఛత్తీస్‌గఢ్ లాంటి రాష్ట్రాలు ఏర్పాటు చేశాం. తెలంగాణ అభివృద్ధి కోసం రాష్ట్ర ఏర్పాటుకు మద్దతు ఇచ్చాం. తెలంగాణ అమ-రవీరులకు నివాళులర్పిస్తున్నా. అమరవీరుల కలలు కన్న రీతిలో ఇంకా రాష్ట్రం వెనకబడి ఉంది. చిన్నమ్మ సుష్మా స్వరాజ్ తెలంగాణ ఏర్పాటుకు కృషి చేశారు. తెలంగాణ ఏర్పాటును వ్యతిరేకించిన వారు అధికారంలో ఉన్నారు. రాష్ట్ర అభివృద్ధికి బీజేపీ కట్టుబడి ఉంది. జార్ఖండ్ ఏర్పాటు సమయంలో జార్ఖండ్ ఏర్పాటు కానివ్వం అన్నవారే ఇప్పుడు ప్రభుత్వంలో ఉన్నారు.



# 91 మంది ఖైదీలకు ప్రభుత్వం క్షమాభిక్ష

### వారి ఉపాధికి తోడ్పాటు అందిస్తామన్న జైళ్లశాఖ డీజీ

**ప్రజానావ, హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం 91 మంది ఖైదీలకు క్షమాభిక్ష మంజూరు చేసింది. దీంతో ప్రకటించిన ఖైదీలు జైళ్ల నుంచి విడుదల కానున్నారు. ఈ విషయాన్ని తెలంగాణ జైళ్ల శాఖ డీజీ సౌమ్యా మిశ్రా వెల్లడించారు. విడుదలవుతున్న ఖైదీలు సమాజంలో కొత్త జీవితాన్ని ప్రారంభించాలని, మళ్లీ జైలు బాట పట్టకుండా బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగాలని ఆమె సూచించారు. విడుదల అవుతున్న వారిలో 85 మంది పురుషులు, ఆరుగురు మహిళలు ఉన్నారు. వీరిలో 38 మంది జైళ్ల శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పెట్రోల్ బంకుల్లో పనిచేయడానికి ఆసక్తి చూపినట్లు డీజీ తెలిపారు. వారికి వెంటనే నియామక పత్రాలు అందజేయనున్నట్లు చెప్పారు. మిగిలిన 53 మంది వ్యవసాయం, స్వయం ఉపాధి రంగాల్లో స్థిరపడాలని నిర్ణయించుకున్నారని, వారికి కూడా అవసరమైన సహకారం అందిస్తామని వెల్లడించారు. అలాగే విడుదల అవుతున్న మహిళా ఖైదీల్లో నలుగురికి కుట్టు మిషన్లు అందజేసి ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు తెలిపారు. విడుదల అవుతున్న వారు బాధ్యతాయుతంగా జీవించి సమాజంలో మంచి గుర్తింపు తెచ్చుకుంటే.. జైళ్ల శాఖ చేసిన కృషి ఫలించినట్లవుతుందని సౌమ్యా మిశ్రా పేర్కొన్నారు. గత ఏడాది కొత్త ప్రభుత్వం 213 మంది ఖైదీల విడుదలకు అనుమతి ఇవ్వగా, ఈసారి మరో 91 మందికి క్షమాభిక్ష మంజూరు చేసినట్లు ఆమె తెలిపారు. సుప్రీంకోర్టు మార్గదర్శకాల మేరకు ప్రత్యేక జీవో జారీ చేసిన ప్రభుత్వం, అర్హులైన ఖైదీలకు ఏడాదిలో మూడు సార్లు క్షమాభిక్ష ఆధారంగా విడుదల అవకాశాలు కల్పించే విధానాన్ని అమలు చేస్తోందని వెల్లడించారు.

# సంక్షేమం నుంచి సంక్షోభంలోకి తెలంగాణ

### పుష్కర తెలంగాణ కాస్తా ముష్కర తెలంగాణ

### తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ నేత కేటీఆర్

**ప్రజానావ, హైదరాబాద్:** తెలంగాణ భవన్‌లో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాల వేసి, అమరవీరులకు నివాళులర్పించారు. అనంతరం జాతీయ జెండాను ఆవిష్కరించారు. అలాగే జయశంకర్ సార్ విగ్రహానికి పూలమాలలు వేసి, బీఆర్ఎస్ నేతలు నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు తెలంగాణ కళాకారులకు కేటీఆర్ సన్మానం చేశారు. అనంతరం పార్టీ శ్రేణులను ఉద్దేశించి మాట్లాడిన ఆయన.. రాష్ట్రంలోని ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. ఒకప్పుడు అభివృద్ధి, సంక్షేమానికి ప్రతీకగా నిలిచిన తెలంగాణ ప్రస్తుతం సంక్షోభంలోకి నెట్టబడిందని అన్నారు. తెలంగాణ ఉద్యమ స్ఫూర్తిని ప్రజల్లో నింపేందుకు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఎన్నో పాటలు రాశారని కేటీఆర్ గుర్తు చేశారు. ఉద్యమ ప్రస్థానంలో కేసీఆర్ అనేక పాత్రలు పోషించారని, తెలంగాణ సాధన కోసం తన జీవితాన్నే అంకితం చేశారని పేర్కొన్నారు. తెలంగాణ వచ్చుడో.. కేసీఆర్ సచ్చుడో' అనే నినాదంతో ముందుకు సాగి ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించారని అన్నారు. కేసీఆర్ జీవిత గాథపై సినిమా తీయాలని ఒక దర్శకుడు తనను కలిసిన సందర్భాన్ని కేటీఆర్ ప్రస్తావించారు. కాళేశ్వరం ప్రాజెక్టు పూర్తయిన తర్వాత ఆలోచిద్దామని కేసీఆర్ చెప్పారని, తెలంగాణ ఆవిర్భావం అనేది అన్ని ప్రతికూల పరిస్థితులను ఛేదించి సాధించిన చారిత్రక విజయమని ఆ దర్శకుడు అభిప్రాయపడ్డారని తెలిపారు. కేసీఆర్ అనే మూడు అక్షరాల ముందు 'ముఖ్యమంత్రి' అనే పదవి చాలా చిన్నదిగా కనిపిస్తుందని ఆయన వ్యాఖ్యానించినట్లు చెప్పారు. ప్రస్తుతం రాష్ట్ర పరిస్థితులపై ఆందోళన వ్యక్తం చేసిన కేటీఆర్.. 'పుష్కర తెలంగాణ ఇప్పుడు ముష్కరుల తెలంగాణగా మారిపోయింది. నిష్ఫల తెలంగాణగా మారిపోయింది' అని విమర్శించారు. తెలంగాణ సాధన కోసం పదవిని మాత్రమే కాదు.. అవసరమైతే ప్రాణత్యాగానికీ సిద్ధపడ్డ నాయకుడు కేసీఆర్ అని పేర్కొన్నారు. నల్లగొండ జిల్లాలో ఫ్లోరైడ్ సమస్యతో బాధపడిన ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించి వేలాది కుటుంబాల కష్టాలను తీర్చిన నాయకుడు కేసీఆర్ కాదా అని ప్రశ్నించారు. రాష్ట్ర అభివృద్ధికి ఆయన చేసిన కృషిని కొందరు ఉద్దేశపూర్వకంగా విస్మరిస్తున్నారని ఆరోపించారు. రాజకీయ పరిస్థితులపై స్పందిస్తూ.. 2014, 2018 ఎన్నికల్లో బీఆర్ఎస్ ఒంటరిగానే విజయం సాధించిందని, 2023 ఎన్నికల్లో కూడా ఒంటరిగానే పోటీ చేసి స్వల్ప తేడాతో ఓడిపోయిందని కేటీఆర్ పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ అడ్డదారిలో అధికారంలోకి వచ్చిందని ఆరోపిస్తూ, ప్రస్తుతం రాష్ట్రాన్ని వెనక్కి నెట్టే విధంగా పాలన సాగుతోందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై విమర్శలు చేస్తూ.. గ్యారంటీల హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్ర ఆర్థిక, పరిపాలనా వ్యవస్థలను దెబ్బతీస్తోందని ఆరోపించారు. 'వడ్డించిన విస్తరి లాంటి తెలంగాణను కుక్కలు చింపిన విస్తరిగా మార్చుతున్నారు' అని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. సంక్షేమం, అభివృద్ధిలో దేశానికి ఆదర్శంగా నిలిచిన తెలంగాణ ప్రస్తుతం సంక్షోభంలో కూరుకుపోయిందని కేటీఆర్ అన్నారు. అయితే ఈ పరిస్థితులు శాశ్వతం కాదని, 2028 డిసెంబర్‌లో మళ్లీ కేసీఆర్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపడతారని ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రజలు మరోసారి బీఆర్ఎస్‌కు అవకాశం ఇస్తారని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.





# చమురు మంటల్లో సామాన్యుడు

## పెట్రో రేషనింగే ఏకైక మార్గమా?

చమురు మంటలు చల్లారేలా లేవు. ఇప్పటికే వరుసగా నాలుగుసార్లు పెట్రో ధరలను పెంచేశారు. వాణిజ్య సిలిండర్ ధరలు అమాంతంగా పైకి ఎగబాకాయి. పెట్రో సంక్షోభం ఇంకెన్నాళ్లో తెలియదు. అంతర్జాతీయం గా ముడి చమురు ధరలు పెరగడంతో భారత్ లాంటి దేశాలకు గుదిబండగా మారింది. ధరల దాడి ఇప్పట్లో ఆగేలా లేదు. పొదుపు మంత్రం పాటించిన ప్రధాని మోడీ అన్నింటా విఫలం అవుతోంది. పొదుపు ప్రభుత్వంలో కానరావడం లేదు. ధరలను అదుపు చేసే చిత్తశుద్ధి కనిపించడం లేదు. పెట్రో ధరలతో అన్ని వస్తువుల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. ఉప్పులు, పప్పులు మొదలుకుని అన్నీ పెరుగుతున్నాయి. వంటనూనెల ధరలు సలసల కాగుతున్నాయి. వీటిపై సమీక్షించాల్సిన కేంద్రం మిన్నకుంది. పెట్రో ఉత్పత్తుల ధరలు పెరిగినా, వాటి డిమాండ్ తగ్గడం లేదు. ఎందుకంటే ప్రతి ఒక్కరికీ పెట్రో, డీజిల్, గ్యాస్ అనివార్యం అయ్యింది. పెట్రో ఉత్పత్తుల ధరలు పెరిగడంతో వినియోగదారులు వేరే సరుకుల కొనుగోలు తగ్గించి పెట్రో ఉత్పత్తులను కొనుగోలు చేస్తారు. అందుచేత పెట్రో ఉత్పత్తుల ధరలు పెరిగి నప్పుడు వాటి డిమాండ్ తగ్గకపోగా ఇతర సరుకుల డిమాండ్ పడిపోతుంది. దాని ఫలితంగా ఆర్థిక వ్యవస్థ మాంద్యం దిశగా అడుగులు వేస్తుంది. చమురు ఉత్పత్తుల సరఫరా ఎంతగా తగ్గితే అంతగా వాటి ధరలు పెరుగుతాయి. తగ్గిపోయిన సరఫరాకు తగ్గట్టు వాటి డిమాండ్ తగ్గిపోవాలంటే అంత ఎక్కువగా వాటి ధరలు పెరగాలి. అప్పుడు ఆర్థిక వ్యవస్థ అంత తీవ్రంగా మాంద్యంలో కూరుకుపోతుంది. దీనిపై ఆర్‌బిఐ గానీ, కేంద్రం కానీ సమీక్షించి చర్యలకు ఉపక్రమించడం లేదు. పశ్చిమాసియాలో సాగుతున్న యుద్ధంతో ప్రపంచ ముడి చమురు ధరలు బ్యారెల్‌కు 100 డాలర్ల మార్కు దాటేసింది. ప్రజలపైకి పెరిగిన చమురు భారాలను నెట్టడం అనివార్యంగా అనుసరిస్తున్నారు. ధరలు పెంయడం మినహా మిగతా చర్యలపై కేంద్రంలోని ఏ పాలకులు ఆలోచన చేయడం లేదు. దేశ ఆర్థిక వ్యవస్థ గురించి వారి అవగాహన రాహిత్యం ఇందుకు ఉదాహరణగా చెప్పుకోవాలి. చమురు ధరలు పెరగడం అనేది దాని సరఫరా తగ్గినందువలన సంభవించేది కాదు. నిజానికి ఇప్పుడు ఒకవైపు యుద్ధం కొనసాగుతున్నా, చమురు నిల్వలు సరఫరాను కొనసాగించగల స్థాయిలోనే ఉన్నాయి. చమురు నిల్వలకు కొరత ఏర్పడబోతుందన్న అంచనాలతో ధరలు పెంచేస్తున్నారు. సరఫరా తగ్గడం, అంతర్‌ఆజతీయంగా బ్యారెల్ ధరలు పెరగడంతో ఆ భారం ప్రజలపై నెట్టేస్తున్నారు. వాస్తవానికి ఆర్థిక మాంద్యం వల్లే చమురు సరఫరాకు, డిమాండ్‌కు మధ్య సమతూకం ఏర్పడుతుంది. పెట్రో కొరత ఏర్పడినప్పుడు విచ్చలవిడి వినయోగాన్ని అదుపు చేయాలి. ప్రధానంగా సంపన్న వర్గాల వినియోగాన్ని నియంత్రించాలి. చమురు దిగుమతులు తగ్గినప్పుడు ఆ ప్రభావం వలన వినిమయం కూడా తగ్గిపోయి, ప్రత్యామ్నాయాల వైపు దృష్టి మళ్ళి దేశీయ ఉత్పత్తుల కోసం డిమాండ్ పెరుగుతుంది. దేశ ఆర్థిక వ్యవస్థ మీద ఈ విధానం ప్రభావం చూపుతుంది. ప్రపంచవ్యాప్తంగా చమురు ధరలు పెరిగినప్పుడు దేశీయంగా పెట్రో ఉత్పత్తుల ధరలను పెంచకపోతే ఆ పెట్రో ఉత్పత్తులను దేశీయంగా ఉత్పత్తి చేసేవారు. పంపిణీ చేసేవారు నష్టపోతారు. ఆ నష్టాన్ని ప్రభుత్వం సబ్సిడీ ద్వారా భరించవచ్చు. అప్పుడు చమురు దిగుమతులకు మనం డాలర్ల రూపంలో చెల్లించవలసినది 8 శాతం పెరుగుతుంది. పెట్రో ఉత్పత్తుల రేషనింగ్ ద్వారా సంపన్నుల వినిమయాన్ని అదుపు చేస్తే అప్పుడు వారి వినిమయం వేరే ఉత్పత్తులవైపు మరలుతుంది. ఉపాధి కూడా పెరగవచ్చు. అంతే కాదు, శ్రామిక ప్రజల కొనుగోలు శక్తి, జీవన ప్రమాణాలు పడిపోకుండా నిలబడతాయి. కేవలం సంపన్నుల వినిమయాన్ని మాత్రమే రేషనింగ్ ద్వారా అదుపు చేస్తే దానివల్లే పెట్రో వినిమయం అవసరమైన మోతాదు మేరకు తగ్గిపోతుందని కూడా చెప్పలేము. ఇది అందరికీ వర్తించాలి. ఇక్కడ మోడీ ప్రకటించిన పొదుపును అందరూ పాటించేలా తప్పనిసరి చేయాలి. పెట్రో ఉత్పత్తుల ధరలను పెంచడం గాని, తద్వారా కోట్లాదిమంది ప్రజల మీద భారాలను మోపడం కాని, దేశ ఆర్థిక వ్యవస్థలో మాంద్యం పెరగడానికి దోహదపడుతుంది. పెట్రో ఉత్పత్తుల ధరలు పెరగడంతో, తక్కిన ఉత్పత్తుల వినియోగం బాగా తగ్గిపోయింది. పైగా వినియోగదారులే పెట్రో ధరల పెంపు భారాన్ని కూడా భరించవలసి వచ్చింది. దాంతో సర్వత్రా ద్రవ్యోల్బణ పరిస్థితులు నెలకొన్నాయి. ఢిల్లీలో కాలుష్యాన్ని కంట్రోల్ చేయడానికి వాహనాలపై ఆంక్షలు విధించారు. ఇప్పుడు పెట్రోల్ కోసం కూడా ఇలా అంక్షలు విధించి ప్రజలను భాగస్వాములను చేయాలి. తగిన పద్ధతిలో కట్టుదిట్టంగా దానిని అమలు చేయడం సాధ్యమే. ఇలా చయడంతో పాటు, కాలర్ల అమ్మకాలనపైనా ఆంక్షలు విధించాలి. దీంతో పెట్రో ఆదాతో పాటు, కాలుష్యం కూడా తగ్గగలదు. ఎన్నో ప్రత్యమ్నాయ పద్దతులను అధ్యయనం చేయాల్సి ఉంది. అప్పుడే ధరల భారాన్ని ప్రజలపై పడకుండా చూడవచ్చు. నిల్వలు కరిగిపోకుండా చేయవచ్చు.

# మరోసారి తీవ్రస్థాయికి ఉద్రిక్తతలు

- పశ్చిమ ఆసియాలో మళ్లీ యుద్ధ మేఘాలు
- కొలిక్కిరాని దౌత్యపరమైన ప్రయత్నాలు
- చర్చలు నిలిపేస్తున్నామని ఇరాన్ ప్రకటన
- 'హార్ముజ్' జలసంధిని పూర్తిగా మూసివేత!



**న్యూఢిల్లీ:** పశ్చిమ ఆసియా (మిడిల్ ఈస్ట్)లో ఉద్రిక్తతలు మరోసారి తీవ్రస్థాయికి చేరుకున్నాయి. లెబనాన్‌లో ఇజ్రాయెల్ తన సైనిక చర్యలను మరింత విస్తృతం చేయడాన్ని నిరసిస్తూ.. అమెరికాతో మధ్యవర్తుల ద్వారా జరుగుతున్న దౌత్యపరమైన చర్చలను ఇరాన్ సోమవారం రద్దు చేసుకుంది. ఈ మేరకు ఇరాన్ అధికారిక వార్తా సంస్థ 'తస్నిమ్' ఒక ప్రకటన విడుదల చేసింది. పశ్చిమ ఆసియాలో యుద్ధాన్ని ముగించడానికి జరుగుతున్న దౌత్యపరమైన ప్రయత్నాలు పూర్తిగా స్తంభించిపోవడంతో ఇరాన్ చర్చల బృందం ఈ కఠిన నిర్ణయం తీసుకున్నట్లు సదరు వార్తా సంస్థ పేర్కొంది. ఈ చర్చల నిలిపివేతపై ఇరాన్ ప్రతినిధులు స్పందిస్తూ.. "లెబనాన్‌లో ఇజ్రాయెల్ నిరంతరం సాగిస్తున్న అకృత్యాల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నాం. కాల్పుల విరమణ ఒప్పందానికి లెబనాన్ అంశం ఒక ముఖ్యమైన ముందస్తు షరతు. కానీ ఇప్పుడు లెబనాన్‌తో సహా అన్ని రంగాలలోనూ ఈ కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఇజ్రాయెల్ ఉల్లంఘించింది. అందుకే మధ్యవర్తుల ద్వారా అమెరికాతో జరుపుతున్న చర్చలను, పత్రాల మార్పిడిని ఇరాన్ బృందం తాత్కాలికంగా నిలిపివేస్తోంది" అని తస్నిమ్ నివేదించింది. ఆక్రమిత ప్రాంతాల నుండి ఇజ్రాయెల్ దళాలు పూర్తిగా వెనక్కి వెళ్లాలని, అలాగే గాజా, లెబనాన్‌లలో సైనిక చర్యలను పూర్తిగా నిలిపివేయాలనే తమ డిమాండ్లు నెరవేరే వరకు అమెరికాతో దౌత్యపరమైన చర్చలను తిరిగి ప్రారంభించే ప్రసక్తే లేదని ఇరాన్ స్పష్టం చేసింది. ఈ నిర్ణయానికి కొద్దిసేపటి ముందే ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాక్చీ సోషల్ మీడియా వేదికగా అమెరికా, ఇజ్రాయెల్‌లను హెచ్చరించారు. లెబనాన్‌లో ఉద్రిక్తతలు పెంచడం అంటే.. అమెరికాతో కుదిరిన విస్తృత కాల్పుల విరమణ నిబంధనలను ఉల్లంఘించడమే అవుతుందని ఆయన స్పష్టం చేశారు.

"ఇరాన్-అమెరికా మధ్య కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందం అనేది నిస్సందేహంగా లెబనాన్‌తో సహా అన్ని రంగాలకు వర్తిస్తుంది. ఏదైనా ఒక రంగంలో దీనిని ఉల్లంఘిస్తే, అది అన్ని వైపులా ఉల్లంఘించినట్లే అవుతుంది. దీనివల్ల వచ్చే పరిణామాలకు అమెరికా, ఇజ్రాయెల్ దేశాలే పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుంది." అని ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాక్చీ పేర్కొన్నారు. అమెరికాతో దౌత్య సంబంధాలు తెంచుకోవడంతో పాటు, ఇరాన్ తన కూటమి దేశాలతో కలిసి అంతర్జాతీయంగా అత్యంత కీలకమైన 'స్ట్రెయిట్ ఆఫ్ హార్ముజ్'ను పూర్తిగా స్తంభించిపోయేలా చేయడానికి కార్యాచరణ సిద్ధం చేసినట్లు ప్రకటించింది. దీనితో పాటు ఎర్రసముద్రంలోని 'బాబ్ ఎల్ మండేబ్'జలసంధి లోనూ ఇతర వ్యూహాత్మక పంథాలను అస్త్రాలుగా మార్చి, ఇజ్రాయెల్ మరియు దానికి మద్దతు ఇస్తున్న దేశాలను ఆర్థికంగా, సైనికంగా 'శిక్షించాలని' ఇరాన్ కూటమి నిర్ణయించింది. గాజా, లేబనాన్‌లలో ఇజ్రాయెల్ క్రూరమైన ఆర్మీ ఆపరేషన్లను తక్షణమే ఆపాలని, లేదంటే ఈ ప్రతిఘటన మరింత తీవ్రంగా ఉంటుందని ఇరాన్ పట్టుబడుతోంది. ఈ పరిణామాల వల్ల అంతర్జాతీయ చమురు సరఫరాకు మరియు ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# భారత్‌లో ఎబోలా టెన్షన్

**ఒక కొత్త స్ట్రెయిన్ వేగంగా వ్యాప్తి**

**అప్రమత్తమైన భారత ప్రభుత్వం**




**న్యూఢిల్లీ:** కొంగో, ఉగాండా తదితర ఆఫ్రికా దేశాల్లో ఎబోలా వ్యాధి వేగంగా విస్తరిస్తున్న తరుణంలో భారత ప్రభుత్వం అప్రమత్తమైంది. ఎబోలాలోని అత్యంత ప్రమాదకరమైన 'బుండిబుగ్యో' స్ట్రెయిన్ వేగంగా వ్యాపిస్తుండటంతో కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ తాజా గైడ్‌లైన్స్ జారీ చేసింది. ముఖ్యంగా డెమొక్రాటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగో, ఉగాండా, దక్షిణ సుడాన్ దేశాలకు అత్యవసరమైతే తప్ప ప్రయాణాలు పెట్టుకోవద్దని భారతీయులను కోరినట్లు ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో అధికారిక ప్రకటన ద్వారా చెప్పింది. తాజా పరిస్థితులపై ప్రపంచ ఆరోగ్య సంస్థ తీవ్ర ఆందోళన వ్యక్తంచేసింది. మే 17, 2026న ఈ ఎబోలా వ్యాప్తిని 'పబ్లిక్ హెల్త్ ఎమర్జెన్సీ ఆఫ్ ఇంటర్నేషనల్ కన్సర్న్' గా ప్రకటించింది. అలాగే ఆఫ్రికా సీడీసీ సైతం దీనిని ఖండాంతర భద్రతా ముప్పుగా పరిగణించిందని 'ద హిందూ' పత్రిక తన నివేదికలో తెలిపింది. ఈ ప్రమాదకర పరిణామాలను దృష్టిలో ఉంచుకుని మే చివరి వారంలో కేంద్ర ప్రభుత్వం పటిష్ట చర్యలు చేపట్టింది. కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి జేపీ నడ్డా ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించి, విమానాశ్రయాల్లో పటిష్టమైన స్క్రీనింగ్, నిఘా ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. దేశంలో ఇప్పటివరకు ఎబోలా (బుండిబుగ్యో స్ట్రెయిన్) కేసులు ఏవీ నమోదు కాలేదనీ, ప్రజలు భయపడాల్సిన అవసరం లేదని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. ముందస్తు జాగ్రత్తగా అన్ని అంతర్జాతీయ విమానాశ్రయాల్లో విదేశాల నుంచి వచ్చే ప్రయాణికులకు థర్మల్ స్క్రీనింగ్ తప్పనిసరి చేశారు. గత 21 రోజుల్లో ఎబోలా ప్రభావిత దేశాల నుంచి నేరుగా వచ్చిన వారు లేదా ఆ దేశాల మీదుగా ప్రయాణించి వచ్చిన వారు కచ్చితంగా స్వీయ నిర్బంధంలో ఉండాలని కేంద్ర ఆరోగ్య శాఖ గట్టిగా సూచించింది. ఒకవేళ ఆ ప్రయాణికులలో అకస్మాత్తుగా జ్వరం, తీవ్రమైన తలనొప్పి, కండరాల నొప్పి, వాంతులు, విరేచనాలు, లేదా శరీరంలో ఎక్కడినుంచైనా అకారణంగా రక్తస్రావం కావడం వంటి లక్షణాలు కనిపిస్తే తక్షణమే స్థానిక ఆరోగ్య అధికారులకు సమాచారం అందించాలి. సాయం కోసం వెంటనే కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన టోల్ ఫ్రీ హెల్ప్‌లైన్ నంబర్ '1075' కు కాల్ చేయాలని విజ్ఞప్తి చేసింది. సకాలంలో వైద్య సహాయం పొందడం ద్వారా బాధితుల ప్రాణాలను కాపాడుకోవడమే కాకుండా, ఇతరులకు వ్యాధి సోకకుండా నిరోధించవచ్చని ది హిందూ రిపోర్ట్ చేసింది. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు కేంద్రం స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్స్ పంపింది. ఆసుపత్రులలో ప్రత్యేక ఐసోలేషన్ వార్డులు, పరీక్షల కోసం ల్యాబొరేటరీలను ఎప్పుడూ సిద్ధంగా ఉంచాలని.. ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ ), నేషనల్ సెంటర్ ఫర్ డిసీజ్ కంట్రోల్ అధికారులకు స్పష్టమైన ఆదేశాలు అందాయి. విమానాశ్రయంలో ఎవరైనా అనుమానిత రోగులు గుర్తిస్తే వెంటనే వారిని ప్రత్యేక అంబులెన్సుల ద్వారా ఐసోలేషన్ సెంటర్లకు తరలించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు.

# మరో రికార్డు దిశగా మోడీ

- 7 రోజుల్లో నెహ్రూ రికార్డుకు బ్రేక్
- వరుసగా అత్యధిక కాలం ప్రధానిగా కొత్త చరిత్ర
- జూన్ 10న ఎన్డీఏ ముఖ్యమంత్రుల సమావేశం
- చంద్రబాబు ప్రవేశపెట్టనున్న ప్రత్యేక తీర్మానం
- 9 వేల రోజుల పాలనా నాయకత్వానికి చేరువైన మోడీ

**న్యూఢిల్లీ:** ప్రధాని నరేంద్ర మోడీ మరో చారిత్రాత్మక మైలురాయికి చేరువయ్యారు. మరో ఏడు రోజుల్లో భారత తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ పేరిట ఉన్న వరుసగా అత్యధిక కాలం ప్రధానిగా పనిచేసిన రికార్డును అధిగమించనున్నారు. జూన్ 9 నాటికి మోడీ వరుసగా 4,398 రోజులు ప్రధానిగా కొనసాగి కొత్త రికార్డును నమోదు చేయనున్నారు. జవహర్‌లాల్ నెహ్రూ 1952 మే 13న తొలి లోక్‌సభ ఎన్నికల అనంతరం ప్రధానిగా బాధ్యతలు స్వీకరించారు. ఆ తర్వాత 1964 మే 27 వరకు వరుసగా 4,397 రోజుల పాటు ప్రధానిగా కొనసాగారు. ఇప్పుడు అదే రికార్డును మోడీ అధిగమించబోతున్నారు. 2014 మే 26న ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన మోడీ, 2019లో రెండోసారి, 2024లో మూడోసారి వరుస విజయాలు సాధించి పదవిలో కొనసాగుతున్నారు. ఈ చారిత్రాత్మక సందర్భంగా జూన్ 10న ఎన్డీఏ ముఖ్యమంత్రులు, మిత్రపక్షాల నేతల సమావేశం నిర్వహించేందుకు కూటమి సిద్ధమవుతోంది. మోడీ నాయకత్వంలో దేశం సాధించిన పురోగతి, కేంద్ర ప్రభుత్వం అమలు చేసిన కీలక కార్యక్రమాలను ప్రశంసిస్తూ ప్రత్యేక తీర్మానాన్ని ఆమోదించనున్నట్లు సమాచారం. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ తీర్మానాన్ని ప్రవేశపెట్టనున్నారని రాజకీయ వర్గాలు చెబుతున్నాయి. ప్రధానిగా మోడీ ఇప్పటికే అనేక రికార్డులను సొంతం చేసుకున్నారు. అత్యధిక కాలం పదవిలో కొనసాగిన తొలి కాంగ్రెసేతర ప్రధానిగా చరిత్ర సృష్టించారు. మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయ్ పేరిట ఉన్న 2,272 రోజుల రికార్డును కూడా గతంలోనే అధిగమించారు. అలాగే వరుసగా మూడు సాధారణ ఎన్నికల్లో విజయం సాధించిన తొలి కాంగ్రెసేతర ప్రధానిగా నిలిచారు. మోడీ రాజకీయ జీవితంలో మరో విశేషం కూడా ఉంది. 2001 అక్టోబర్ 7న గుజరాత్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన ఆయన, 2014 మే వరకు ఆ పదవిలో కొనసాగారు. అనంతరం ప్రధానిగా బాధ్యతలు స్వీకరించారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఎన్నికైన ప్రభుత్వాలకు నిరంతరాయంగా నాయకత్వం వహిస్తూ సుమారు 9 వేల రోజుల పాలనా అనుభవాన్ని నమోదు చేశారు. దేశ రాజకీయ చరిత్రలో ఎన్నికైన ప్రభుత్వాలకు ఇంత సుదీర్ఘ కాలం నిరంతరాయంగా నాయకత్వం వహించిన నేతగా మోడీ కొత్త అధ్యాయాన్ని లిఖించబోతున్నారని రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు.

# సీబీఎస్ఈ అన్ స్క్రీన్ మార్కింగ్ వివాదం

**న్యూఢిల్లీ:** సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ ఆన్-స్క్రీన్ మార్కింగ్ కు సంబంధించిన వివాదం మరింత ముదురుతోంది. కోఎంప్ట్ ఎడ్యుటెక్ సంస్థకు కాంట్రాక్ట్ కేటాయించిన విధానంపై సీబీఎస్ఈ నుంచి కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ పూర్తి నివేదిక కోరింది. ఈ వ్యవహారంలో అవకతవకలు జరిగాయని తేలితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని కేంద్రం హెచ్చరించింది. కోఎంప్ట్ కు కాంట్రాక్టను కేటాయించేటప్పుడు అనుసరించిన విధానాలు, నిర్ణయం తీసుకునే పక్రియలో పాల్గొన్న అధికారులతో సహా, టెండర్ పక్రియకు సంబంధించిన పూర్తి వివరాలను అందించాలని సీబీఎస్ఈని మంత్రిత్వ శాఖ కోరింది. తొలిసారిగా అమలు చేసిన ఆన్-స్క్రీన్ మార్కింగ్ విధానంపై విద్యార్థులు, తల్లిదండ్రుల నుంచి వేల ఫిర్యాదులు వచ్చాయి. కొన్ని సమాధాన పత్రాలు సరిగా స్కాన్ కాకపోవడం, పేజీలు కనిపించకపోవడం, మార్కుల లెక్కల్లో పొరపాట్లు చోటుచేసుకున్నాయనే ఆరోపణలు వెల్లువెత్తాయి. కొన్ని వేల జవాబు పత్రాలను తిరిగి మాన్యువల్‌గా మూల్యాంకనం చేయాల్సి వచ్చింది . వివాదం రాజకీయ రంగు కూడా పులుముకుంది. కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ తీవ్ర ఆరోపణలు చేశారు (అఃూఇ బి।నిట।స ఇనీనిబిసనీల।సబా). ఓఎస్ఎమ్ టెండర్ పక్రియలో మార్పులు చేసి కోఎంప్ట్‌కు అనుకూలంగా నిబంధనలను సడలించారని ఆరోపించారు. టెండర్ నిబంధనల్లో పలు మార్పులు జరిగాయని, దీంతో సంస్థకు అర్హత లభించిందని ఆయన పేర్కొన్నారు.

# సాధించుకున్న తెలంగాణ ముష్కరుల పాలయింది

- మోడీ, రేవంత్ రెడ్డిలు రైతులకు యూరియా ఇవ్వరు
- 2014 ముందున్న కష్టాలు మళ్లీ కాంగ్రెస్ పాలనలో వచ్చాయి
- సిరిసిల్లలో బీఆర్ఎస్ పార్టీలోకి చేరికల సమావేశంలో కేటీఆర్ ధ్వజం



**ప్రజానావ, సిరిసిల్ల :** తెలంగాణ రాష్ట్రం ఏర్పడి పుష్కరకాలం గడిచింది, దురదృష్టవశాత్తు రాష్ట్రం ఇప్పుడు ముష్కరుల చేతిలోకి పోయిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి, సిరిసిల్ల శాసనసభ్యులు కే. తారక రామారావు ఆరోపించారు. మంగళవారం సిరిసిల్ల తెలంగాణ భవన్ లో పలువురు వివిధ పార్టీల నుండి బీఆర్ఎస్‌లో చేరిన సందర్భంగా సమావేశం నిర్వహించారు. పార్టీలో చేరిన వారికి కేటీఆర్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోదీ, రేవంత్ రెడ్డిలు యూరియా పంపిణీ చేయరని, ఓట్లప్పుడు తప్ప నాట్లప్పుడు రైతుబంధు వేసే మొఖం రేవంత్ రెడ్డికి లేదన్నారు. రైతులకు 2014 ముందు ఉన్న కష్టాలు మళ్లీ కాంగ్రెస్ పాలనలో వచ్చాయన్నారు. రైతులు కాళ్ల మీద పడకండి.. కాలర్ పట్టుకోండి.. గల్లా పట్టి అడగండని కేటీఆర్ పిలుపునిచ్చారు. రేవంత్ రెడ్డి రైతు డిస్కం పేరిట కొత్త దుకాణం పెట్టిండని, రైతు డిస్కం పేరిట ట్రాన్స్ఫార్లకు మీటర్లు.. మోటార్లకు మీటర్లు పెడతాడట అని హెచ్చరించారు. డిస్కం లను నష్టాల పేరిట ప్రైవేటు వారికి అమ్మేందుకే రేవంత్ రెడ్డి కుట్ర పన్నుతున్నట్టు కేటీఆర్ ఆరోపించారు. 420 హామీలలో రైతు డిస్కం పెడతానని చెబుతున్నడని, దేశంలో ఎక్కడా లేని డిస్కం ఇక్కడ ఎందుకు పెట్టినవని ప్రశ్నించారు. ధాన్యం కొనలేనోడు.. రైతును కోటీశ్వరుని ఎలా చేస్తాడనని ఎద్దేవా చేశారు. ఏ పంట కొంటలేడు కానీ రైతును రాజు చేస్తాడట అని వ్యంగాస్త్రాలు విసిరారు. రేవంత్ రెడ్డి రెండున్నర ఏళ్లలో నాలుగు లక్షల కోట్ల అప్పు చేశాడని, చేసిన ఒక పని చూపించు అని ప్రశ్నించాడు. రేవంత్ రెడ్డి రెగ్యులర్ సీఎం కాదు.. రెన్యూవల్ సీఎం అని వ్యాఖ్యానించారు. రైతుబంధు ఖాతాలో డబ్బులు పడడం లేదు కానీ రాహుల్ గాంధీ ఖాతాలో మాత్రం రెగ్యులర్ గా పడుతున్నాయనీ ఆరోపించారు. వడ్డించిన విస్తారాకు లాంటి తెలంగాణ ఈరోజు కుక్కలు చింపిన ఇస్తారిలా మారిందని, దేశమంతా కాంగ్రెస్ ను వదిలించుకుంటే.. మనం మాత్రం నెత్తిలో పెట్టుకున్నామని అన్నారు. ఇందిరమ్మ రాజ్యం అంటే రైతులను చావగొట్టడమా.. హామీలు ఎగ్గొట్టుట.. ప్రశ్నించిన బీఆర్ఎస్ నేతలపై కేసులు పెట్టడమా అని కేటీఆర్ ప్రశ్నించారు.

# ప్రతిభను ప్రోత్సహిస్తే సమాజ అభివృద్ధికి బాటలు పడుతాయి

- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్
- గిఫ్ట్ ఏ స్మైల్ కార్యక్రమంలో భాగంగా టాప్-30 మంది విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ




**ప్రజానావ, సిరిసిల్ల :** ప్రతిభను ప్రోత్సహించడం ద్వారా సమాజ అభివృద్ధికి బాటలు వేయవచ్చని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల శాసనసభ్యులు కే. తారకరామారావు అన్నారు. సిరిసిల్ల నియోజకవర్గంలో పదో తరగతి వార్షిక పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన మొదటి 30 మంది విద్యార్థులకు గిఫ్ట్ ఏ స్మైల్ కార్యక్రమంలో భాగంగా సిరిసిల్ల శాసన సభ్యులు, మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మంగళవారం సిరిసిల్ల పట్టణంలోని గీతనగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ట్యాబ్‌లను పంపిణీ చేసి అభినందించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ, విద్యార్థుల కష్టానికి గుర్తింపుగా అందిస్తున్న ఈ ప్రోత్సాహకాలు మరింత ఉన్నత లక్ష్యాలను సాధించేందుకు స్ఫూర్తినిస్తాయని అన్నారు. నేటి డిజిటల్ యుగంలో సాంకేతిక పరిజ్ఞానం విద్యార్థులకు ఎంతో అవసరమని, ట్యాబ్‌లను విద్యాభివృద్ధికి వినియోగించుకొని భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని సూచించారు. సిరిసిల్ల విద్యార్థులు రాష్ట్ర స్థాయిలోనే కాకుండా జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లోనూ రాణించే సామర్థ్యం కలిగి ఉన్నారని కేటీఆర్ పేర్కొన్నారు. ప్రతిభను ప్రోత్సహించడం ద్వారా సమాజ అభివృద్ధికి బాటలు వేయవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో గీతనగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం శారద, ఉపాధ్యాయులు, సిరిసిల్ల పట్టణ మున్సిపల్ చైర్మన్ జిందం కళ చక్రపాణి , కౌన్సిలర్లు, బీఆర్ఎస్ సిరిసిల్ల పట్టణ అధ్యక్షు జిందం చక్రపాణి, జిల్లా అధ్యక్షులు తోట ఆగయ్యతో పాటు పలువురు పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. ప్రతిభను గుర్తించి, విద్యార్థుల ముఖాల్లో చిరునవ్వులు నింపే "గిఫ్ట్ ఏ స్మైల్" కార్యక్రమం మరోసారి సిరిసిల్లలో విద్యకు, విద్యార్థుల భవిష్యత్తుకు కేటీఆర్ అందిస్తున్న ప్రాధాన్యతను చాటిచెప్పింది.

# శాంతి భద్రతలు పటిష్టంగా ఉన్నప్పుడే సమాజ అభివృద్ధి వేగవంతం

**జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే**

**జిల్లా పోలీస్ కార్యాలయంలో రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు.**

**ప్రజానావ, సిరిసిల్ల :** తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే జాతీయ జెండాను ఎగురవేసి జిల్లా ప్రజలకు, పోలీస్ అధికారులకు, సిబ్బందికి రాష్ట్ర అవతరణ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ శాంతి భద్రతలు పటిష్టంగా ఉన్నప్పుడే సమాజ అభివృద్ధి వేగవంతం అవుతుందన్నారు. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి,భవిష్యత్తుకు బలమైన పునాది వేయడంలో పోలీస్ శాఖ కీలక పాత్ర పోషిస్తోందని తెలిపారు. ప్రజల భద్రత, శాంతి పరిరక్షణ కోసం ప్రతి పోలీస్ అధికారి, సిబ్బంది అంకితభావంతో విధులు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ చంద్రయ్య, డిఎస్పీ లు నాగేంద్రచారి, శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, ఏఓ పద్మ, సిఐ శ్రీనివాస్, నాగేశ్వరరావు, వెంకటేష్, రవీందర్, మొగిలి, రవి, ఆర్ఐ లు మధుకర్, సురేష్, ఎస్ఐ లు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.





# జాతీయ జెండాను ఆవిష్కరించిన కలెక్టర్

**ప్రజానావ, సిరిసిల్ల :** రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకల సందర్భంగా జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ జాతీయ జెండాను మంగళవారం ఆవిష్కరించారు. రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని తెలంగాణ తల్లి విగ్రహానికి జిల్లా కలెక్టర్ పూల మాల వేశారు. అనంతరం పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించి.. జాతీయ జెండాను ఆవిష్కరించారు. అంతకు ముందు జిల్లా కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో ఆవిష్కరించారు. పలువురు విద్యార్థులకు నోట్ బుక్ లు అందజేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, ఏవో రాంరెడ్డి వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# ముంబై, భీవండీలో ఘనంగా తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం

**ప్రజానావ, ముంబై:** ముంబై, భివండీ ప్రాంతాల్లో తెలంగాణ సంఘాల ఆధ్వర్యంలో తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఖార్ నాకా వద్ద జరిగిన కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర సాధనలో ముంబైలోని ఉద్యమకారుల పాత్రను గుర్తించి వారికి తగిన గౌరవం, గుర్తింపు కల్పించాలని నాయకులు కోరారు. ఈ సందర్భంగా తెలంగాణ ఉద్యమకారులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కురుమ సంఘం నాయకులు, తెలంగాణ ఉద్యమకారులు, కార్మిక నేతలు, తెలంగాణ అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అలాగే గాయత్రి నగర్, పద్మనగర్ ప్రాంతాల్లో కూడా ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఉత్సాహంగా జరిగాయి.

# రాజకీయ పార్టీలు, సంస్థలలో ఆవిర్భావ వేడుకలు

**పాల్గొన్న నేతలు, ప్రజా ప్రతినిధులు**

**ప్రజానావ, సిరిసిల్ల :** రాజకీయ పార్టీలు, వివిధ సంస్థల ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలు మంగళవారం సిరిసిల్ల జిల్లా కేంద్రంలో వేర్వేరుగా ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా రాజకీయ పార్టీలు వారి పార్టీ కార్యాలయాలలో జాతీయ జెండాలను ఎగురవేయగా పాత బస్టాండ్ లోని అమ-రవీరుల స్థూపం వద్ద నివాళులు అర్పించారు. తెలంగాణ తల్లి విగ్రహం వద్ద వేడుకలు జరిపారు. గాంధీ చౌక్ తదితర ప్రధాన కూడళ్లలో తెలంగాణ ఆవిర్భావ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలలో భాగంగా కలెక్టరేట్, జిల్లా ఎస్పీ కార్యాలయం తదితర ప్రభుత్వ కార్యాలయాలలో అధికారులు జెండాలు ఆవిష్కరించి వేడుకలు జరిపారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే రాజేష్ శ్రీనివాస్ జెండాను ఆవిష్కరించారు. సిరిసిల్ల సహకార విద్యుత్ సరఫరా సంస్థ(సెస్)లో చైర్మన్ చిక్కాల రామారావు జాతీయ పతాకం ఆవిష్కరించగా సంస్థ డైరెక్టర్లు, ఉద్యోగులు పాల్గొన్నారు. తెలంగాణ భవన్ లో బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య జెండా ఆవిష్కరించగా పట్టణ అధ్యక్షులు జిందం చక్రపాణి, మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళాచక్రపాణి తో పాటు నాయకులు పాల్గొన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో, మున్సిపల్ కార్యాలయం, పట్టణ నడిబొడ్డు గాంధీ చౌక్ కూడలి లో చైర్ పర్సన్ జిందం కళాచక్రపాణి జాతీయ పతాకం ఆవిష్కరించారు. అలాగే అమరవీరుల స్తూపం, తెలంగాణ తల్లి విగ్రహం వద్దనివాళి అర్పించారు. బీజేపీ కార్యాలయంలో పార్టీ జిల్లా అధ్యక్షులు రెడ్డబోయిన గోపి జెండాను ఆవిష్కరించారు. టౌన్ క్లబ్ లో సిరిసిల్ల పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు, టౌన్ క్లబ్ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్ జెండాను ఆవిష్కరించారు. ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు మదాసు బలరాం జెండాను ఆవిష్కరించారు.

# 80 ఏళ్ల వృద్ధురాలిపై లైంగికదాడి

**యువకుడు అరెస్టు**

**ప్రజానావ, ముంబై :** మహిళల భద్రతపై ఆందోళనలు పెరుగుతున్న తరుణంలో, ఛత్రపతి సంభాజీనగర్ జిల్లాలోని పచోడ్ ప్రాంతంలో ఓ వృద్ధురాలిపై జరిగిన లైంగిక దాడి ఘటన తీవ్ర కలకలం రేపింది. సహాయం చేస్తానని నమ్మించి ఇంటికి తీసుకెళ్లిన 28 ఏళ్ల యువకుడు 80 ఏళ్ల వృద్ధురాలిపై లైంగిక దాడికి పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం, పైఠాన్ తాలూకాలోని పచోడ్‌లో కళ్యాణనగర్ ప్రాంతానికి చెందిన 80 ఏళ్ల వృద్ధురాలు సోమవారం మధ్యాహ్నం బలమైన గాలుల కారణంగా ఇబ్బందులకు గురయ్యారు. ఆ సమయంలో అక్కడే ఉన్న రోహన్ అహెర్ అనే యువకుడు ఆమెకు సహాయం చేస్తానని చెప్పి తన ఇంటికి తీసుకెళ్లాడు. అయితే ఇంటికి తీసుకెళ్లిన అనంతరం వృద్ధురాలిపై అసభ్యంగా ప్రవర్తించిన నిందితుడు, ఆమెపై లైంగిక దాడికి పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయి. దీంతో వృద్ధురాలు గట్టిగా కేకలు వేయగా, ఆ శబ్దం విన్న స్థానికులు, మహిళలు వెంటనే అక్కడికి చేరుకుని ఆమెను రక్షించారు. తర్వాత ఈ విషయాన్ని వృద్ధురాలి కుటుంబ సభ్యులకు తెలియజేయగా వారు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. అనంతరం బాధితురాలిని పచోడ్ పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లి ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడు రోహన్ అహెర్‌ను అరెస్టు చేశారు. కేసుకు సంబంధించిన దర్యాప్తును సబ్ ఇన్‌స్పెక్టర్ రామ్ బరహాతే చేపట్టినట్లు పోలీసులు వెల్లడించారు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర ఆగ్రహానికి దారితీసింది. వృద్ధులు, మహిళల భద్రత కోసం మరింత కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు పోలీసు అధికారులను కోరుతున్నారు.

# సీపీఎం నుంచి మల్లారపు అరుణ్ కుమార్ బహిష్కరణ

**సీపీఎం జిల్లా కార్యదర్శి మూషం రమేష్**

**ప్రజానావ, సిరిసిల్ల :** వీర్నపల్లి మండల కేంద్రానికి చెందిన సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు మల్లారపు అరుణ్ కుమార్ బూర్జువా పార్టీ ప్రలోభాలకు తలొగ్గి ఆర్థిక అవకాశవాదంతో వ్యవహరించడం వల్ల ఆయనను పార్టీ ప్రాథమిక సభ్యత్వం నుండి బహిష్కరిస్తున్నట్లు సిపిఎం జిల్లా కార్యదర్శి మూషం రమేష్ తెలిపారు. మంగళవారం సిరిసిల్ల బివై నగర్ లోని అమృత లాల్ శుక్లా భవన్ లో సిపిఎం జిల్లా కమిటీ అత్యవసర సమావేశం సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కోడం రమణ అధ్యక్షతన జరిగింది. ఈ మేరకు సిపిఎం జిల్లా కార్యదర్శి మూషం రమేష్ మాట్లాడుతూ గత కొంతకాలంగా మల్లారపు వరుణ్ కుమార్ బీఆర్ఎస్ ఆర్థిక ప్రలోభాలతో పార్టీని మండలంలో లేకుండా చేయాలని నానా రకాలుగా ప్రయత్నాలు చేశాడని దానిపై పలుమార్లు సర్ది చెప్పినప్పటికీ వినిపించుకోలేదన్నారు. సిపిఎం తనను ఎంపీటీసీగా సర్పంచిగా పార్టీ నాయకుడిగా అంచలంచెలుగా ఎదగటానికి దోహదం చేసిందన్నారు. ఇకమీదట మల్లారపు అరుణ్ కుమార్ కు సిపిఎం పార్టీ ప్రజా సంఘాలకు ఎటువంటి సంబంధం ఉండదని తెలిపారు. ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎగమంటి ఎల్లారెడ్డి, జవ్వాజి విమల, జిల్లా కమిటీ సభ్యులు గన్నేరం నర్సయ్య, అన్నల్దాస్ గణేష్, ముక్తి కాంత అశోక్, సూరం పద్మ, గురజాల శ్రీధర్, శ్రీరాముల రమేష్ చంద్ర తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా ఆవిర్భావ వేడుకలు

**పారిశుద్ధ్య కార్మికురాలి చేతుల మీదుగా జాతీయ జెండా ఆవిష్కరణ**

**ప్రజానావ, హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఖైరతాబాద్ నియోజకవర్గంలోని ఫిలింనగర్ డివిజన్‌లో భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహనీయుల విగ్రహాల వద్ద జాతీయ జెండాను ఆవిష్కరించి తెలంగాణ అమరవీరులకు నివాళులర్పించారు. ప్రత్యేకంగా జీహెచ్ఎంసీ పారిశుద్ధ్య కార్మికురాలు శ్రీమతి పద్మ చేతుల మీదుగా జాతీయ జెండాను ఆవిష్కరింపజేసి ఆమె సేవలను సన్మానించారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ, అంత్యోదయ సిద్ధాంతం ప్రకారం సమాజంలోని చిట్టచివరి వ్యక్తికి కూడా అభివృద్ధి ఫలాలు అందించాలన్నదే భారతీయ జనతా పార్టీ లక్ష్యమని పేర్కొన్నారు. తెలంగాణలో ప్రజాస్వామ్య విలువలు మరింత బలోపేతం కావాలని, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా అభివృద్ధి జరగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఫిలింనగర్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు ముద్దంగుల శ్రీనివాస్, హైదరాబాద్ సెంట్రల్ జిల్లా ఓబీసీ మోర్చా ఉపాధ్యక్షుడు వల్లెపు శంకర్, జిల్లా కార్యవర్గ సభ్యుడు మేకల గణేష్ యాదవ్, సీనియర్ నాయకులు వుట్ల శశిశేఖర్, మల్లికార్జున్ గౌడ్, డివిజన్ ప్రధాన కార్యదర్శి దొంగరి రజకళ, కిసాన్ మోర్చా అధ్యక్షుడు పురుషోత్తం, దళిత మోర్చా అధ్యక్షుడు తలారి బాలేశ్వర్, మహిళా మోర్చా అధ్యక్షురాలు జి. రమ్య, యువమోర్చా అధ్యక్షుడు మంజల నరసింహ, ఎం. భీమయ్య, పద్మ, పారిజాత, మార్ల అంజి తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. కార్యక్రమంలో పాల్గొన్నవారు తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి, ప్రజా సంక్షేమానికి ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

## తెలంగాణకు విముక్తి తెచ్చిన ఉద్యమ నాయకుడు కేసీఆర్: మాదాసు శ్రీనివాస్

**ప్రజానావ, గజ్వేల్ :** తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని అహ్మదీపూర్ గ్రామంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో పార్టీ జెండా ఆవిష్కరణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రామ పార్టీ అధ్యక్షుడు నిజామొద్దీన్ జెండా ఎగురవేశారు. కార్యక్రమానికి మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్ నాయకత్వం వహించారు. ఈ సందర్భంగా మాదాసు శ్రీనివాస్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. దశాబ్దాల పాటు కొనసాగిన వివక్ష, అవమానాలు, అణచివేతల నుంచి తెలంగాణ ప్రజలకు విముక్తి లభించిన చారిత్రక రోజు జూన్ 2 అని పేర్కొన్నారు. అమరవీరుల త్యాగాలు, తెలంగాణ ప్రజల ఆత్మగౌరవ పోరాట ఫలితంగానే 60 ఏళ్ల కల సాకారమై ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిందన్నారు. తెలంగాణ ఉద్యమాన్ని విజయతీరాలకు చేర్చడంలో కేసీఆర్ కీలక పాత్ర పోషించారని కొనియాడారు. 14 ఏళ్ల ఉద్యమ పోరాటం, అనంతరం తొమ్మిదిన్నరేళ్ల పాలనలో తెలంగాణ అభివృద్ధే లక్ష్యంగా పని చేశారని తెలిపారు. కేసీఆర్ నాయకత్వంలో రాష్ట్రం అన్ని రంగాల్లో గణనీయమైన ప్రగతి సాధించి దేశానికి ఆదర్శంగా నిలిచిందన్నారు. ప్రస్తుతం తెలంగాణ అస్తిత్వ పరిరక్షణ, ప్రజల సమస్యల పరిష్కారం కోసం బీఆర్ఎస్ పార్టీ ప్రజల పక్షాన పోరాడుతోందని చెప్పారు. రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా ప్రజాసేవకు మరింత అంకితభావంతో పనిచేయాలని, తెలంగాణ ప్రయోజనాల పరిరక్షణ కోసం మరోసారి ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రైతుబంధు సమితి మాజీ అధ్యక్షుడు మద్ది రాజిరెడ్డి, సర్పంచ్ బ్యాగారి ప్రభాకర్, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి రమేష్ గౌడ్, మాజీ కో-ఆప్షన్ సభ్యుడు అహ్మద్, ఉప సర్పంచ్ గోపాల్ రెడ్డి, బాలయ్య, శ్రీనివాస్, రాజు, రాములు, కనకయ్య, బుచ్చిరెడ్డి, రాములు గౌడ్, నాంపల్లి, లింగం, ముత్యం తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా రాష్ట్ర అవతరణ దినోత్సవం



- జాతీయ జెండాను ఆవిష్కరించిన ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్
- లబ్ధిదారులకు పథకాలు పంపిణీ
- అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

**ప్రజానావ, సిరిసిల్ల :** తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను వైభవంగా నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను జిల్లా పోలీస్ భవన్ సమీపంలోనిహోపరేడ్ గ్రౌండ్ లో మంగళవారం నిర్వహించగా, ముఖ్యఅతిథిగా ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ హాజరయ్యారు. ముందుగా సిరిసిల్లలోని పాత బస్ స్టాండ్ సమీపంలోని తెలంగాణ అమరవీరుల స్తూపం వద్ద ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ తదితరులతో కలిసి నివాళులర్పించారు. అనంతరం పరేడ్ గ్రౌండ్లో జాతీయ జెండాను ప్రభుత్వ విప్ ఆవిష్కరించి పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా సందేశాన్ని వినిపించారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేశారు.హో

### "స్టాళ్ల పరిశీలన"

అటవీ శాఖ, డీఆర్డీఓ, పోలీస్ శాఖ, పౌర సంబంధాల శాఖల ఆద్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాళ్లను ప్రభుత్వ విప్, జిల్లా కలెక్టర్, ఎస్పీ పరిశీలించి.. వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా పర్యావరణ ఉత్సవాల కింద అటవీ శాఖ ఆద్వర్యంలో ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి గితే, అధికారులు మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణ గౌడ్, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, అదనపు ఎస్పీ చంద్రయ్య, వేములవాడ ఆర్డీవో కే ఎస్ బీ కుమారి, అడిషనల్ ఎస్పీ చంద్రయ్య, డీఎస్పీ నాగేంద్రాచారి, సిరిసిల్ల తహసిల్దార్ మహేష్ కుమార్, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే దానం



**ప్రజానావ, హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని ఫిలింనగర్‌లోని గౌతమ్‌నగర్ కమ్యూనిటీ హాల్ వద్ద సోమవారం ఘనంగా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఖైరతాబాద్ శాసనసభ్యులు దానం నాగేందర్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి తెలంగాణ అమరవీరుల త్యాగాలను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో జూబ్లీహిల్స్ డివిజన్ అధ్యక్షుడు కాటూరి రమేష్, గుంటి నాగేష్ సాగర్, ఆకుల రాజు, అబ్దుల్ గని, దయ్యాల దాసు, ఆర్. ఎల్లయ్య, పోతుల మల్లేష్, ధర్మానాయక్, ప్రభాకర్, బోయ సాయిలు, అశోక్, ఎండీ గౌస్, బోదాస్ నాగార్జున, హరీష్, రామకృష్ణారెడ్డి, చందు, పద్మ, చంద్రమ్మ, కవిత, మహేశ్వరి, నక్కరము, తిరుపతి, సత్యనారాయణ, బాలస్వామి, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు. తెలంగాణ సాధన కోసం పోరాడిన అమరవీరుల త్యాగస్ఫూర్తిని గుర్తు చేసుకుంటూ రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం అందరూ కలిసికట్టుగా పనిచేయాలని ఈ సందర్భంగా నాయకులు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో స్థానిక ప్రజలు, పార్టీ కార్యకర్తలు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఉత్సాహంగా జరుపుకున్నారు.

# కరీంనగర్ రాజకీయాలపై ఎంఐఎం చీఫ్ గుర్రు!

- పట్టణంలో ముదురుతున్న వివాదంపై అసదుద్దీన్ ఒవైసీ ఫైర్!
- టౌన్ అధ్యక్షుడికి దారుస్సలాం సీరియస్ అల్టిమేటం
- ఈద్ మిలాప్ వేదికగా బట్టబయలైన విభేదాలపై ఆగ్రహం
- అసద్ పక్కా స్కెచ్.. కరీంనగర్ నాయకత్వంపై ప్రత్యేక నిఘా
- కరీంనగర్ ఎంఐఎంలో ఆధిపత్య పోరు రచ్చకెక్కేనా?



**ప్రజానావ, కరీంనగర్:** "నగరంలో పార్టీని నడిపించాల్సిన ఆ లీడర్ వైఖరి.. ఇప్పుడు దారుస్సలాం పెద్దల ఆగ్రహానికి కారణమైందా? అంతా సవ్యంగానే ఉందనుకుంటున్న వేళ.. కరీంనగర్ టౌన్ అధ్యక్షుడి వ్యవహార శైలిపై పార్టీ అధినేత అసదుద్దీన్ ఒవైసీ ఒక్కసారిగా తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేయడం వెనుక ఉన్న అసలు ట్విస్ట్ ఏంటి? ఇన్నాళ్లూ కరీంనగర్ లో సైలెంట్‌గా ఉన్న పతంగి.. ఇప్పుడు సొంత గూట్లోనే కుదుపునకు గురికావడం వెనుక ఏ రకమైన రాజకీయం నడుస్తోంది? ఇటీవల జరిగిన ఈద్ మిలాప్ కార్యక్రమం తర్వాత బయటపడ్డ ఆ లీకులు ఇప్పుడు స్థానిక నాయకత్వానికి నిద్రలేకుండా చేస్తున్నాయి. ఒకవైపు ఏళ్లుగా జెండా మోసిన పాత కేడర్ ఆగ్రహం, మరోవైపు కొత్తగా వచ్చిన నాయకులతో టౌన్ బాస్ నడుపుతున్న బంధం.. ఈ రెండింటి మధ్య నలిగిపోతున్న పార్టీని లైన్ లోకి తెచ్చేందుకు అసదుద్దీన్ ఒవైసీ వేసిన ఆ సరికొత్త యాక్షన్ ప్లాన్ ఏంటనే సస్పెన్స్ ఇప్పుడు కరీంనగర్ పొలిటికల్ సర్కిల్స్‌లో జోరుగా సాగుతోంది." ఎన్నడూ లేని విధంగా కరీంనగర్ ఎంఐఎం గ్రూప్ రాజకీయాలు వేడెక్కడం ఇప్పుడు స్థానిక లీడర్లలో టెన్షన్ పుట్టిస్తోంది.

### రంగంలోకి ఎంఐఎం చీఫ్

పార్టీ కేడర్ గుసగుసల ప్రకారం.. కరీంనగర్ టౌన్ అధ్యక్షుడి ఒంటెద్దు పోకడలు, పాత కార్యకర్తలను విస్మరించడం వంటి అంశాలపై అధిష్టానం అత్యంత సీరియస్‌గా ఉన్నట్లు తెలుస్తోంది. సంవత్సరాలుగా పార్టీని నమ్ముకుని, ప్రతి చిన్న కార్యక్రమాన్ని విజయవంతం చేసిన సీనియర్ కేడర్‌ను పక్కనపెట్టి, కొత్తగా పార్టీలోకి వచ్చిన వారికి మాత్రమే ప్రాధాన్యత ఇస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తడంతో అధిష్టానం వద్ద పంచాయితీ పడింది. ఈ ఫిర్యాదులను తీవ్రంగా పరిగణించిన ఎంఐఎం చీఫ్ అసదుద్దీన్ ఒవైసీ.. టౌన్ అధ్యక్షుడి తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. పార్టీ కంటే ఎవరూ ఎక్కువ కాదని, కేడర్‌ను ఇబ్బంది పెడితే చూస్తూ ఊరుకునేది లేదని గట్టి హెచ్చరికలు జారీ చేసినట్లు భోగట్టా. ఈ క్రమంలోనే కరీంనగర్ భవిష్యత్ వ్యూహం, స్థానిక నాయకత్వ మార్పులపై అధిష్టానం ప్రత్యేక నిఘా పెట్టింది.

### మార్పులు రావడం ఖాయమనే ప్రచారం..

ఇదిలా ఉండగా, కరీంనగర్ టౌన్ అధ్యక్ష పదవిలో మార్పులు రావడం ఖాయమనే ప్రచారం ఇప్పుడు జిల్లా రాజకీయాల్లో మరింత వేగం అందుకుంది. వచ్చే మున్సిపల్ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని, పార్టీని మరింత బలోపేతం చేసేందుకు వీలుగా త్వరలోనే ప్రస్తుత టౌన్ అధ్యక్షుడికి ఉద్వాసన పలికి, కొత్త నియామకం లేదా అధ్యక్షుడి ఎన్నిక జరపాలని దారుస్సలాం పెద్దలు భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ ప్రక్రియ మొత్తం ఎంఐఎం చీఫ్ అసదుద్దీన్ ఒవైసీ ప్రత్యేక పర్యవేక్షణలోనే ఉండబోతుందని, క్షేత్రస్థాయి నుంచి నివేదికలు తెప్పించుకుని మరీ కొత్త బాస్‌ను ఎంపిక చేయబోతున్నారని పార్టీ వర్గాల్లో బలమైన చర్చ సాగుతోంది. ఈ ఊహించని పరిణామాలతో కరీంనగర్ ఎంఐఎం లీడర్లలో ఎప్పుడు ఏ కుదుపు వస్తుందో తెలియని ఉత్కంఠ నెలకొంది.






# డోపింగ్ ఉచ్చులో దీక్ష..

## కామన్‌వెల్త్ ఆశలకు ఎదురుదెబ్బ

**న్యూఢిల్లీ:** భారత అథ్లెటిక్స్‌కు మరోసారి డోపింగ్ వివాదం షాక్ ఇచ్చింది. దేశానికి చెందిన ప్రముఖ మధ్యదూర పరుగుల క్రీడాకారిణి కేఎం దీక్ష డోపింగ్ పరీక్షలో చిక్కుకున్నట్లు వెలువడుతున్న వార్తలు క్రీడా వర్గాల్లో కలకలం రేపుతున్నాయి. 1500 మీటర్ల విభాగంలో జాతీయ రికార్డు హోల్డర్‌గా గుర్తింపు పొందిన దీక్ష శాంపిల్‌లో నిషేధిత ఉత్ప్రేరకం ఆనవాళ్లు లభించినట్లు సమాచారం. దీంతో వచ్చే కామన్‌వెల్త్ క్రీడల్లో ఆమె పాల్గొనే అవకాశాలపై అనిశ్చితి నెలకొంది. క్రీడా వర్గాల సమాచారం ప్రకారం, దీక్ష శాంపిల్‌లో స్టానోజోలోల్ అనే నిషేధిత పదార్థం ఉన్నట్లు ప్రాథమిక పరీక్షల్లో గుర్తించినట్లు తెలుస్తోంది. ప్రపంచ డోపింగ్ నిరోధక సంస్థ నిషేధిత జాబితాలో ఉన్న ఈ పదార్థం శారీరక సామర్థ్యాన్ని కృత్రిమంగా పెంచే అనబాలిక్ ఏజెంట్‌గా పరిగణించబడుతుంది. ఈ నేపథ్యంలో మే నెల చివరి వారంలో దీక్షకు సంబంధిత అధికారులు నోటీసు పంపినట్లు సమాచారం. అయితే ఇప్పటివరకు ఆమెపై అధికారిక సస్పెన్షన్ విధించలేదు. అయినప్పటికీ, డోపింగ్ ఆరోపణలు నిజమని తేలితే దీక్షపై నాలుగేళ్ల వరకు నిషేధం విధించే అవకాశం ఉందని క్రీడా నిపుణులు చెబుతున్నారు. అలా జరిగితే ఆమె కెరీర్‌కు మాత్రమే కాకుండా భారత అథ్లెటిక్స్‌కు కూడా పెద్ద దెబ్బగా మారనుంది. ముఖ్యంగా కామన్‌వెల్త్ క్రీడలకు ముందు ఈ వివాదం తలెత్తడం భారత బృందానికి ఆందోళన కలిగిస్తోంది. దీక్ష గత ఏడాది అమెరికాలో జరిగిన అంతర్జాతీయ అథ్లెటిక్స్ పోటీలో అద్భుత ప్రదర్శన కనబరిచి కొత్త జాతీయ రికార్డు నెలకొల్పింది. 1500 మీటర్ల రేసును 4 నిమిషాల 4.78 సెకన్లలో పూర్తి చేసి దేశవ్యాప్తంగా ప్రశంసలు అందుకుంది. ఆ ప్రదర్శనతో అంతర్జాతీయ స్థాయిలోనూ ఆమె పేరు మార్మోగింది. ఈ ఏడాది ఏప్రిల్‌లో జైపూర్‌లో జరిగిన భారత అథ్లెటిక్స్ సిరీస్‌లో స్వర్ణ పతకం సాధించిన తర్వాత ఆమె ఎలాంటి పోటీల్లోనూ పాల్గొనలేదు. మధ్యప్రదేశ్‌లోని భోపాల్ అథ్లెటిక్స్ అకాడమీలో శిక్షణ పొందుతున్న దీక్ష ఇటీవల అక్కడి నుంచి తప్పుకున్నట్లు సమాచారం. ప్రస్తుతం డోపింగ్ ఆరోపణలపై ఆమె నుంచి ఎలాంటి స్పందన రాలేదు. అలాగే ఆమె కోచ్ కూడా ఈ వ్యవహారంపై వ్యాఖ్యానించేందుకు నిరాకరించారు. డోపింగ్ కేసులు భారత క్రీడారంగాన్ని తరచూ ఇబ్బందులకు గురిచేస్తున్న తరుణంలో దీక్ష వ్యవహారం మరోసారి క్రీడాకారులపై పర్యవేక్షణ, అవగాహన కార్యక్రమాల అవసరాన్ని గుర్తుచేస్తోంది. విచారణ పూర్తయ్యే వరకు అధికారిక నిర్ణయం వెలువడకపోయినా, ఈ వ్యవహారం భారత అథ్లెటిక్స్‌లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది.




# ఢిల్లీలో ఆఫ్ఘన్ 'హోమ్' సిరీస్

**న్యూఢిల్లీ:** క్రికెట్ చరిత్రలో అరుదైన ఘట్టానికి రంగం సిద్ధమవుతోంది. ఆఫ్ఘనిస్థాన్ జట్టు తొలిసారిగా భారత జట్టుకు ఆతిథ్యం ఇవ్వనుంది. అయితే ఈ 'హోమ్' సిరీస్‌కు వేదిక కూడా భారతదేశమే కావడం విశేషం. ఈ ఏడాది సెప్టెంబర్‌లో ఢిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియంలో మూడు ట్వంటీ-20 మ్యాచ్‌ల సిరీస్ నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. భారత క్రికెట్ నియంత్రణ మండలి, ఆఫ్ఘనిస్థాన్ క్రికెట్ బోర్డు మధ్య ఉన్న స్నేహపూర్వక సంబంధాల నేపథ్యంలో ఈ సిరీస్ సాధ్యమవుతోంది. పరస్పర పర్యటనల ఒప్పందంలో భాగంగా ఆఫ్ఘనిస్థాన్ చేసిన ప్రతిపాదనకు భారత బోర్డు సూత్రప్రాయంగా అంగీకరించినట్లు సమాచారం. అవసరమైన ప్రక్రియలు పూర్తయిన తర్వాత అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉంది. గతంలో కూడా ఇతర దేశాల క్రికెట్ బోర్డులకు సహకారంగా భారత బోర్డు ఇలాంటి సిరీస్‌ల నిర్వహణకు మద్దతు ఇచ్చింది. ఈ సిరీస్ కోసం ఢిల్లీని వేదికగా ఖరారు చేయడంలో భారత బోర్డు కీలక పాత్ర పోషించింది. సెప్టెంబర్ 13, 16, 19 తేదీల్లో మ్యాచ్‌లు జరిగే అవకాశం ఉందని తెలుస్తోంది. ఈ మ్యాచ్‌ల నిర్వహణ కోసం స్థానిక క్రికెట్ సంఘం తమ దేశీయ టోర్నీ షెడ్యూల్‌లో కూడా మార్పులు చేయడానికి సిద్ధమవుతోంది. స్వదేశంలో రాజకీయ, భద్రతా పరిస్థితుల కారణంగా ఆఫ్ఘనిస్థాన్ గత పదేళ్లుగా తమ అంతర్జాతీయ 'హోమ్' మ్యాచ్‌లను భారత్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లో నిర్వహిస్తోంది. గతంలో ఐర్లాండ్, బంగ్లాదేశ్ జట్లతో జరిగిన పలు సిరీస్‌లకు కూడా భారత నగరాలే వేదికలయ్యాయి. ఇదిలా ఉండగా, ఈ ట్వంటీ-20 సిరీస్‌కు ముందే ఆఫ్ఘనిస్థాన్ జట్టు మరోసారి భారత్‌కు రానుంది. జూన్ 6 నుంచి 20 వరకు ఒక టెస్టు మ్యాచ్, మూడు వన్డేల సిరీస్‌లో పాల్గొననుంది. జూన్ 6న న్యూ చండీగఢ్‌లో ఏకైక టెస్టు మ్యాచ్ జరగనుండగా, జూన్ 14, 17, 20 తేదీల్లో వరుసగా ధర్మశాల, లక్నో, చెన్నై వేదికలుగా వన్డే మ్యాచ్‌లు నిర్వహించనున్నారు. ఈ రెండు ఫార్మాట్లలోనూ హష్మతుల్లా షాహిదీ జట్టుకు నాయకత్వం వహించనున్నాడు.

# ఐదు టైటిళ్ల ఘనత సాధించిన కృనాల్




**బెంగళూరు:** ఇండియన్ ప్రీమియర్ లీగ్ చరిత్రలో అత్యంత విజయవంతమైన ఆటగాళ్ల జాబితాలో ఆల్‌రౌండర్ కృనాల్ పాండ్యా అరుదైన ఘనతను సొంతం చేసుకున్నాడు. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు వరుసగా రెండోసారి ఐపీఎల్ ఛాంపియన్‌గా నిలవడంతో కృనాల్ తన కెరీర్‌లో ఐదో ఐపీఎల్ టైటిల్‌ను అందుకున్నాడు. దీంతో ఐదు లేదా అంతకంటే ఎక్కువ ఐపీఎల్ ట్రోఫీలు గెలిచిన అత్యంత అరుదైన ఆటగాళ్ల సరసన నిలిచాడు. ఇండియన్ ప్రీమియర్ లీగ్‌లో అత్యధిక టైటిళ్లు గెలిచిన ఆటగాళ్లలో రోహిత్ శర్మ, అంబటి రాయుడు చెరో ఆరు ట్రోఫీలతో అగ్రస్థానంలో ఉన్నారు. వారి తర్వాత ఐదు టైటిళ్లతో మహేంద్ర సింగ్ ధోనీ, హార్దిక్ పాండ్యా, కీరన్ పొలార్డ్, జస్ప్రీత్ బుమ్రా ఉన్నారు. ఇప్పుడు ఈ ప్రతిష్ఠాత్మక జాబితాలో కృనాల్ పాండ్యా కూడా చేరి తన ప్రత్యేకతను చాటుకున్నాడు. ముంబై ఇండియన్స్ తరఫున 2017, 2019, 2020 సీజన్లలో మూడు టైటిళ్లు గెలిచిన కృనాల్, ఆ తర్వాత బెంగళూరు జట్టులో చేరి 2025, 2026 సీజన్లలో మరో రెండు ట్రోఫీలు అందుకున్నాడు. 2025లో బెంగళూరు జట్టులో చేరిన తర్వాత కృనాల్ ప్రదర్శన జట్టుకు ఎంతో ఉపయోగపడింది. గత సీజన్ ఫైనల్లో అత్యుత్తమ ఆటగాడిగా నిలిచిన అతడు, ఈ సీజన్‌లో కూడా ఆల్‌రౌండ్ ప్రతిభతో ఆకట్టుకున్నాడు. బ్యాటింగ్‌లో 226 పరుగులు చేయడంతో పాటు బౌలింగ్‌లో 14 వికెట్లు పడగొట్టి జట్టు విజయాల్లో కీలక పాత్ర పోషించాడు. ముఖ్యంగా ఫైనల్ మ్యాచ్‌లో కట్టుదిట్టమైన బౌలింగ్‌తో ప్రత్యర్థి జట్టుపై ఒత్తిడి పెంచి విజయంలో తన వంతు పాత్రను సమర్థంగా నిర్వర్తించాడు. ఈ విజయంతో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ఐపీఎల్ చరిత్రలో వరుసగా రెండుసార్లు టైటిల్ గెలిచిన మూడో జట్టుగా నిలిచింది. ఇంతకుముందు ఈ ఘనతను ముంబై ఇండియన్స్, చెన్నై సూపర్ కింగ్స్ మాత్రమే సాధించాయి. బెంగళూరు జట్టు ఇప్పుడు ఆ రెండు దిగ్గజ జట్ల సరసన చోటు సంపాదించుకుంది. మ్యాచ్ అనంతరం స్పందించిన కృనాల్ పాండ్యా తన ఆనందాన్ని అభిమానులతో పంచుకున్నాడు. ప్రతి ఐపీఎల్ ట్రోఫీ తనకు ఎంతో ప్రత్యేకమని, వాటిలో ఏదీ మరొకదానికంటే ఎక్కువ కాదని పేర్కొన్నాడు. పదకొండు సంవత్సరాల కెరీర్‌లో ఐదు టైటిళ్లు గెలవడం తన జీవితంలో మరపురాని ఘట్టమని తెలిపాడు. కష్టకాలాల్లోనూ జట్టుకు అండగా నిలిచిన అభిమానులకే ఈ విజయాన్ని అంకితం చేస్తున్నట్లు భావోద్వేగంగా వెల్లడించాడు. కృషి, పట్టుదల, జట్టుపై అంకితభావం ఉంటే ఎలాంటి విజయాలైనా సాధించవచ్చని కృనాల్ మరోసారి నిరూపించాడు. ఐదు ఐపీఎల్ టైటిళ్లతో అతడు ఇప్పుడు లీగ్ చరిత్రలో అత్యంత విజయవంతమైన ఆల్‌రౌండర్లలో ఒకడిగా నిలిచిపోయాడు.

# ఒక్క పరుగుతో ఐర్లాండ్ సంచలనం



**డబ్లిన్:** మహిళల అంతర్జాతీయ ట్వంటీ-20 క్రికెట్‌లో ఐర్లాండ్ జట్టు చారిత్రాత్మక విజయాన్ని నమోదు చేసింది. ముక్కోణపు సిరీస్‌లో భాగంగా వెస్టిండీస్‌తో జరిగిన ఉత్కంఠభరిత పోరులో డక్‌వర్త్-లూయిస్-స్టెర్న్ విధానం ప్రకారం ఒక్క పరుగుతో విజయం సాధించింది. మహిళల ట్వంటీ-20ల్లో వెస్టిండీస్‌పై ఐర్లాండ్‌కు ఇదే తొలి విజయం కావడం విశేషం. ఈ గెలుపుతో ఫైనల్ అవకాశాలను కూడా ఐర్లాండ్ సజీవంగా ఉంచుకుంది. టాస్ గెలిచిన వెస్టిండీస్ ముందుగా బ్యాటింగ్ ఎంచుకుని నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 141 పరుగులు చేసింది. జట్టు కెప్టెన్ హేలీ మాథ్యూస్ ఒక పరుగు మాత్రమే చేసి నిరాశపరిచింది. టేలర్, డాటిన్ వంటి అనుభవజ్ఞులూ ఆశించిన స్థాయిలో రాణించలేకపోయారు. 43 పరుగులకే నాలుగు వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడిన జట్టును షెమైన్ క్యాంప్‌బెల్ ఆదుకుంది. ఆమె కీలక ఇన్నింగ్స్ ఆడగా, చివర్లో గ్లాస్కో వేగంగా పరుగులు సాధించి జట్టుకు పోటీ స్కోరు అందించింది. 142 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ఐర్లాండ్ ఆరంభంలోనే వికెట్లు కోల్పోయినా కెప్టెన్ ఓర్లా ప్రెండర్‌గాస్ట్ అసాధారణ పోరాటం చేసింది. ఆమె దూకుడైన బ్యాటింగ్‌తో జట్టును విజయపథంలో నడిపించింది. 14.1 ఓవర్లకు ఐర్లాండ్ 95 పరుగులకు ఐదు వికెట్లు కోల్పోయిన దశలో వర్షం ఆటకు అంతరాయం కలిగించింది. ఆ సమయంలో డక్‌వర్త్-లూయిస్-స్టెర్న్ లెక్కల ప్రకారం ఐర్లాండ్ లక్ష్యానికి మూడు పరుగులు వెనుకబడి ఉంది. వర్షం కారణంగా మ్యాచ్ నిలిచిపోయే పరిస్థితి రావడంతో ఐర్లాండ్ బ్యాటర్లు కనీసం ఒక బంతి అయినా ఆడాలని పట్టుబట్టారు. అనంతరం జరిగిన కీలక బంతిని లూయిస్ లిటిల్ బౌండరీకి తరలించాడు. అదే మ్యాచ్ మలుపు తిప్పింది. వెంటనే వర్షం మళ్లీ తీవ్రంగా కురవడంతో అంపైర్లు ఆటను నిలిపివేశారు. ఆ సమయానికి డక్‌వర్త్-లూయిస్-స్టెర్న్ విధానం ప్రకారం ఐర్లాండ్ ఒక పరుగు ఆధిక్యంలో ఉండటంతో విజేతగా ప్రకటించారు. ఐర్లాండ్ కెప్టెన్ ఓర్లా ప్రెండర్‌గాస్ట్ 46 బంతుల్లో 71 పరుగులతో అజేయంగా నిలిచి జట్టు విజయానికి ప్రధాన కారణమైంది. బౌలింగ్‌లోనూ కీలక పాత్ర పోషించి సర్వతోముఖ ప్రతిభను కనబరిచింది. ఆమె ప్రదర్శన మ్యాచ్ గెలుపులో నిర్ణాయకంగా మారింది. ఈ ముక్కోణపు సిరీస్‌లో ఐర్లాండ్, వెస్టిండీస్, పాకిస్థాన్ మహిళల జట్లు పాల్గొంటున్నాయి. ప్రస్తుతం ఐర్లాండ్, వెస్టిండీస్ జట్లకు సమానంగా నాలుగు పాయింట్లు ఉన్నప్పటికీ మెరుగైన నెట్ రన్‌రేట్ కారణంగా వెస్టిండీస్ అగ్రస్థానంలో కొనసాగుతోంది. రెండు మ్యాచ్‌ల్లో ఓడిపోయిన పాకిస్థాన్ జట్టు పాయింట్ల పట్టికలో చివరి స్థానంలో ఉంది. ఇంకా మిగిలిన మ్యాచ్‌లు ఉండటంతో ఫైనల్‌కు చేరే పోరు మరింత ఆసక్తికరంగా మారింది.

# వైభవ్ విజయంపై ఐఐఎం అధ్యయనం

**ఇండోర్:** చిన్న వయసులోనే అసాధారణ ప్రతిభతో క్రికెట్ ప్రపంచాన్ని ఆకట్టుకున్న యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ ఇప్పుడు దేశంలోని ప్రముఖ విద్యాసంస్థల దృష్టిని కూడా ఆకర్షించాడు. కేవలం 15 ఏళ్ల వయసులోనే ఒత్తిడిని జయిస్తూ అత్యున్నత స్థాయిలో రాణించిన అతడి విజయ రహస్యాలను తెలుసుకునేందుకు ఇండోర్ భారతీయ నిర్వహణ సంస్థ ప్రత్యేక అధ్యయనాన్ని ప్రారంభించింది. 'వైభవ్ నమూనా' పేరుతో చేపట్టనున్న ఈ పరిశోధనలో క్రీడలు, మనస్తత్వ శాస్త్రం, నిర్వహణ రంగాల నిపుణులు కలిసి పనిచేయనున్నారు. ఒక యువ క్రీడాకారుడి ఎదుగుదలపై దేశంలోనే ఈ తరహా బహుముఖ అధ్యయనం జరగడం విశేషంగా మారింది. ఇటీవల ముగిసిన ఇండియన్ ప్రీమియర్ లీగ్ సీజన్‌లో రాజస్థాన్ జట్టు తరఫున బరిలోకి దిగిన వైభవ్ తన దూకుడు బ్యాటింగ్‌తో అందరినీ ఆశ్చర్యపరిచాడు. మొత్తం 16 ఇన్నింగ్స్‌ల్లో 48.50 సగటుతో 776 పరుగులు సాధించి టోర్నమెంట్‌లో అత్యధిక పరుగులు చేసిన ఆటగాడిగా నిలిచాడు. అంతేకాకుండా 237.30 స్ట్రైక్‌రేట్‌తో ప్రత్యర్థి బౌలర్లపై ఆధిపత్యం చెలాయించాడు. ఒకే సీజన్‌లో 72 సిక్సర్లు బాదుతూ, ఎన్నో సంవత్సరాలుగా నిలిచిన రికార్డును అధిగమించాడు. అతడి అద్భుత ప్రదర్శనకు గుర్తింపుగా సీజన్‌లో ఉత్తమ యువ ఆటగాడు, అత్యుత్తమ దూకుడు బ్యాటర్ అవార్డులు కూడా వరించాయి. ఈ నేపథ్యంలో వైభవ్ సాధించిన విజయాల వెనుక ఉన్న మానసిక, సామాజిక, కుటుంబ, శిక్షణ సంబంధిత అంశాలను లోతుగా




పరిశీలించాలని అధ్యయన బృందం నిర్ణయించింది. చిన్న వయసులోనే అంతటి ఒత్తిడిని ఎలా తట్టుకున్నాడు? అత్యున్నత స్థాయిలో నిలదొక్కుకునేందుకు ఎలాంటి అలవాట్లు, క్రమశిక్షణ, మద్దతు వ్యవస్థలు దోహదపడ్డాయి? వంటి అంశాలపై పరిశోధన సాగనుంది. ప్రతిభ ఒక్కటే విజయానికి సరిపోదని, కుటుంబ సహకారం, మార్గదర్శకుల ప్రోత్సాహం, కఠోర శ్రమ, మానసిక స్థైర్యం వంటి అంశాలు కలిసి విజేతను తయారు చేస్తాయని నిపుణులు భావిస్తున్నారు. అధ్యయనంలో భాగంగా వైభవ్ కుటుంబ సభ్యులు, కోచ్‌లు, సహచర ఆటగాళ్లు, క్రీడా మానసిక నిపుణులతో కూడా మాట్లాడనున్నారు. ఒక యువ క్రీడాకారుడు అత్యధిక అంచనాలు, సామాజిక మాధ్యమాల ప్రభావం, ప్రజాదరణ వల్ల వచ్చే ఒత్తిడిని ఎలా ఎదుర్కొంటాడనే అంశాలను కూడా విశ్లేషించనున్నారు. ప్రస్తుతం యువతలో పెరుగుతున్న మానసిక ఒత్తిడి పరిస్థితుల్లో ఈ పరిశోధన విలువైన సూచనలు అందించగలదని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఈ అధ్యయనం ద్వారా వెలువడే నివేదిక భవిష్యత్‌లో క్రీడాకారుల శిక్షణా విధానాలు, ప్రతిభావంతుల గుర్తింపు కార్యక్రమాలు, విద్యాసంస్థలు అనుసరించే మార్గదర్శకాలకు ఉపయోగపడే అవకాశముంది. అలాగే కార్పొరేట్ రంగంలో ప్రతిభ నిర్వహణ, నాయకత్వ వికాసం, ఒత్తిడి నిర్వహణ వంటి అంశాలకూ ఈ అధ్యయనం కీలక పాఠాలు అందించనుందని పరిశోధకులు చెబుతున్నారు. వైభవ్ సూర్యవంశీ విజయగాథ కేవలం క్రికెట్‌కే పరిమితం కాకుండా, అసాధారణ ప్రతిభను ఎలా సంరక్షించాలి, ఎలా అభివృద్ధి చేయాలనే అంశాలపై దేశానికి ఒక కొత్త దిశను చూపించబోతోందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.




# పసుపు రంగు దుస్తుల్లో మెరిసిన తమన్నా

దక్షిణాది నుంచి బాలీవుడ్ వరకు తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న ప్రముఖ నటి తమన్నా భాటియా మరోసారి తన స్టైలిష్ లుక్‌తో అభిమానులను ఆకట్టుకుంది. ఇటీవల ఓ ప్రత్యేక కార్యక్రమంలో పాల్గొన్న ఆమె పసుపు రంగు మాక్సీ దుస్తుల్లో కనిపించి అందరి దృష్టిని తనవైపు తిప్పుకుంది. సాధారణతకు, హుందాతనానికి ప్రాధాన్యత ఇస్తూ ఆమె ఎంచుకున్న ఈ దుస్తులు సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా చర్చనీయాంశమ య్యాయి. లేత పసుపు రంగులో రూపొందిన ఈ దుస్తులు వేసవి కాలానికి అనువుగా ఉండటమే కాకుండా, తమన్నా వ్యక్తిత్వానికి మరింత అందాన్ని చేకూర్చాయి. భుజాలపై సున్నితంగా అమర్చిన పట్టీలు, శరీరాకృతికి సరిపోయే విధంగా రూపొందించిన పైభాగం, కిందికి వెళ్లే కొద్దీ అలల మాదిరిగా కనిపించే పొరలు ఈ దుస్తులకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. నడుస్తున్న సమయంలో దుస్తులు అందించే సహజమైన కదలిక ఆమె రూపానికి మరింత హుందాతనాన్ని జోడించింది. తన లుక్‌ను మరింత ఆకర్షణీయంగా మార్చేందుకు తమన్నా సాదాసీదా శైలినే ఎంచుకుంది. అతిగా అలంకరణలకు దూరంగా ఉంటూ, సున్నితమైన మేకప్‌తో సహజమైన అందాన్ని ప్రతిబింబించింది. అలాగే సాధారణ హెయిర్ స్టైల్‌తో తన మొత్తం రూపాన్ని సమతుల్యంగా మలిచింది. ఆమె ధరించిన ఆభరణాలు కూడా అధిక ఆడంబరానికి దూరంగా ఉండి, క్లాసిక్ శైలిని ప్రతిబింబించాయి. నటనతో పాటు వ్యాపార రంగంలోనూ తమన్నా విజయవంతంగా ముందుకు సాగుతోంది. 'తమన్నా ఫైన్ జ్యువెలరీ' పేరుతో ఆమె ప్రారంభించిన ఆభరణాల వ్యాపారం క్రమంగా విస్తరిస్తోంది. ప్రత్యేక డిజైన్లతో రూపొందించిన వజ్రాభరణాలను వివిధ కార్యక్రమాల్లో ధరించడం ద్వారా ఆమె తన బ్రాండ్‌కు మరింత గుర్తింపును తీసుకువస్తోంది. ఒక నటిగా కాకుండా, మహిళా వ్యాపారవేత్తగా కూడా ప్రతిభను చాటుకుంటోంది. సినిమాల విషయానికి వస్తే, తమన్నా ప్రస్తుతం పలు ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టులతో బిజీగా ఉంది. విభిన్న కథాంశాలతో కూడిన చిత్రాలను ఎంపిక చేసుకుంటూ తన నటనా ప్రయాణాన్ని కొనసాగిస్తోంది. వాణిజ్య చిత్రాలతో పాటు కొత్త తరహా పాత్రలను కూడా స్వీకరిస్తూ ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతోంది. ఫ్యాషన్, వ్యాపారం, నటన అనే మూడు రంగాల్లోనూ సమానంగా రాణిస్తూ తమన్నా తనకంటూ ప్రత్యేక గుర్తింపును ఏర్పరుచుకుంది. ప్రతి సందర్భంలోనూ తన అభిరుచి, ఆత్మవిశ్వాసం, హుందాతనాన్ని ప్రతిబింబిస్తూ ఆమె యువతకు స్ఫూర్తిగా నిలుస్తోంది. సామాజిక మాధ్యమాల్లో ఆమె తాజా చిత్రాలకు అభిమానుల నుంచి విశేష స్పందన లభిస్తుండగా, ఆమె స్టైల్ మరియు వ్యక్తిత్వంపై ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి.

# 'మస్సా మస్సా' సందడి

## 'పెద్ది'పై అంచనాలు మరింత పెంచిన శక్తివంతమైన పాట!




మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ కథానాయకుడిగా, దర్శకుడు బుచ్చిబాబు సానా రూపొందించిన ప్రతిష్టాత్మక పాన్ ఇండియా చిత్రం 'పెద్ది' విడుదలకు సిద్ధమైంది. జూన్ 4న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానున్న ఈ చిత్రంపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. తాజాగా చిత్రబృందం విడుదల చేసిన 'మస్సా మస్సా' పూర్తి వీడియో పాట అభిమానులను విశేషంగా ఆకట్టుకుంటోంది. విడుదలైన కొద్ది గంటల్లోనే ఈ పాట సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా చర్చనీయాంశమైంది. ప్రముఖ సంగీత దర్శకుడు ఏఆర్ రెహమాన్ స్వరాలు సమకూర్చగా, అనంత శ్రీరామ్ సాహిత్యం అందించారు. విశాల్ మిశ్రా ఆలపించిన ఈ పాటలో గ్రామీణ వాతావరణం, కుస్తీ పోటీలు, కఠిన సాధన, లక్ష్యసాధన కోసం కథానాయకుడు చేసే పోరాటాన్ని ప్రభావవంతంగా ఆవిష్కరించారు. ఈ పాటలో రామ్ చరణ్ చూపించిన శారీరక మార్పు, కుస్తీ కోసం చేసిన కఠోర శ్రమ ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది. శక్తివంతమైన హావభావాలు, గ్రామీణ యువకుడి రూపంలో కనిపించిన తీరు అభిమానుల్లో మరింత ఆసక్తిని రేకెత్తిస్తోంది. సాధారణ యువకుడు జీవితంలోని సవాళ్లను అధిగమించి తన లక్ష్యాన్ని చేరుకునే ప్రయాణాన్ని ఈ పాట ప్రతిబింబిస్తోంది. దర్శకుడు బుచ్చిబాబు సానా ఈ చిత్రాన్ని కేవలం క్రీడా నేపథ్య కథగా కాకుండా భావోద్వేగాలు, ప్రేరణాత్మక అంశాలతో కూడిన చిత్రంగా తెరకెక్కించినట్లు ఇప్పటికే వెల్లడించారు. తాజాగా విడుదలైన ఈ పాట కూడా అదే విషయాన్ని స్పష్టం చేస్తోంది. చిత్రంలో కథానాయకుడి పాత్ర ఎంత బలంగా ఉండబోతోందో ఈ పాట ద్వారా మరోసారి అర్థమవుతోంది. ఈ చిత్రంలో జాన్వీ కపూర్ కథానాయికగా నటిస్తుండగా, శివరాజ్‌కుమార్, జగపతి బాబు, దివ్యేందు శర్మ కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ఏఆర్ రెహమాన్ సంగీతం చిత్రానికి ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది. జూన్ 4న విడుదల కానున్న 'పెద్ది' బాక్సాఫీస్ వద్ద ఎలాంటి విజయాన్ని అందుకుంటుందో చూడాలని అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ప్రస్తుతం విడుదలైన 'మస్సా మస్సా' పాట మాత్రం చిత్రంపై అంచనాలను మరో స్థాయికి తీసుకెళ్లింది.



# మ్యాజికల్ మే అంటూ త్రిష పోస్ట్..

స్టార్ హీరోయిన్ త్రిష తాజాగా ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేసిన ఫొటోలు సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారాయి. తనకు ఎంతో ఇష్టమైన 'మ్యాజికల్ మే' నెల జ్ఞాపకాలను, ఫొటోలను అభిమానులతో పంచుకున్నారు. "40 ఏళ్ల వయసులో 25 ఏళ్ల అమ్మాయిలా కనిపించడం గొప్ప కాదు.. 20 ఏళ్ల వయసులో ఉన్న యువతులు 40 ఏళ్ల ప్రాయాన్ని చూసి భయపడకుండా, ఆ వయసు కోసం ఎంతో ఆసక్తిగా ఎదురుచూసేలా చేయడమే నా లక్ష్యం" అనే వ్యాఖ్యను కూడా జత చేశారు. దీంతో అది చూసిన వారంతా విజయ్ సీఎం అవ్వడంతో మ్యాజికల్ మే అని క్యాప్షన్ పెట్టారని చర్చించుకుంటున్నారు. వీరి రిలేషన్‌పై ఈ పోస్ట్‌తో హింట్ ఇచ్చారని అంటున్నారు.



# బోయపాటి, వెంకటేష్ కాంబోలో కొత్త సినిమా!

దర్శకుడు బోయపాటి శ్రీను, వెంకటేష్‌తో కలిసి కొత్త సినిమా చేయనున్నట్లు తెలుస్తోంది. గతంలో వీరిద్దరి కాంబినేషన్‌లో వచ్చిన 'తులసి' సినిమా సూపర్ హిట్ అయింది. ప్రస్తుతం వెంకటేష్ త్రివిక్రమ్, అనిల్ రావిపూడి దర్శకత్వంలో సినిమాలు చేస్తున్నారు. ఆ సినిమాలు పూర్తయిన తర్వాత బోయపాటితో సినిమాపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది. బోయపాటి శ్రీను తన కెరీర్‌లో భారీ విజయాన్ని సాధించి, తనకంటూ ఒక గుర్తింపు తెచ్చుకోవాల్సిన అవసరం ఉంది.



# దీపికాకు జాన్వీ స్ట్రాంగ్ కౌంటర్?

సినిమా పరిశ్రమలో ప్రస్తుతం అత్యంత చర్చనీయమైన అంశాల్లో వర్క్ కల్చర్ ఒకటి. ముఖ్యంగా బాలీవుడ్, టాలీవుడ్ ఇండస్ట్రీల్లో పని గంటలు, షూటింగ్ విధానం, ఆర్టిస్టులపై ఉండే ఒత్తిడి వంటి అంశాలపై తరుచు చర్చ జరుగుతునే ఉంటుంది. అయితే, ఈ చర్చకు కేంద్రబిందువుగా నిలిచింది బాలీవుడ్ స్టార్ హీరోయిన్ దీపికా పదుకొణె. స్పిరిట్, కల్కి 2 వంటి భారీ ప్రాజెక్ట్‌ల నుంచి ఆమె తప్పుకున్నారనే వార్తలు వచ్చిన తర్వాత.. పని గంటల వివాదం ఇండస్ట్రీ మొత్తం చర్చనీయంగా మారుతుంది. దీపికా పదుకొణె రోజుకు పరిమిత గంటలే పని చేయాలనే నిబంధన పెట్టారని, షూటింగ్ షెడ్యూల్స్ విషయంలో కొన్ని అభిప్రాయ భేదాలు తలెత్తాయని అప్పట్లో ప్రచారం జరిగింది. ఆ తర్వాత సోషల్ మీడియాలో టాలీవుడ్ వర్క్ కల్చర్‌పై రకరకాల కథనాలు వెలువడ్డాయి. ముఖ్యంగా టాలీవుడ్ లో రోజుకు 12 నుంచి 14 గంటల పాటు షూటింగ్‌లు జరుగుతాయని, ఆర్టిస్టులపై భారీ ఒత్తిడి ఉంటుందని కొందరు వ్యాఖ్యానించారు. అయితే, ఈ వివాదంపై తాజాగా బాలీవుడ్ నటి జాన్వీ కపూర్ చేసిన వ్యాఖ్యలు కొత్త మలుపు తిప్పాయి.'దేవర' సినిమాతో టాలీవుడ్‌లో అడుగుపెట్టిన జాన్వీ కపూర్, ప్రస్తుతం రామ్ చరణ్ సరసన 'పెద్ది' సినిమాలో నటిస్తోంది. ఈ సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా ఆమె టాలీవుడ్‌లో తనకు ఎదురైన అనుభవాలను పంచుకుంది. తెలుగు సినిమా సెట్స్‌లో సమయపాలనకు చాలా ప్రాధాన్యత ఇస్తారని, పనిగంటలను చాలా క్రమబద్ధంగా ప్లాన్ చేస్తారని ఆమె వెల్లడించింది. నటీనటులతో పాటు టెక్నీషియన్ల సంక్షేమాన్ని కూడా ఇక్కడ ఎంతో గౌరవిస్తారని పేర్కొంది. జాన్వీ మాటల్లో చెప్పాలంటే.. టాలీవుడ్‌లో లంచ్ బ్రేక్ అనేది కేవలం పేరుకే ఉండదట. ప్రతి ఒక్కరూ ప్రశాంతంగా భోజనం చేసి, కాసేపు విశ్రాంతి తీసుకునేలా ప్రత్యేక సమయం కేటాయిస్తారట. ఆ తర్వాత మళ్లీ షూటింగ్‌లో పాల్గొనడం వల్ల పనితీరు మరింత మెరుగ్గా ఉంటుందని ఆమె అభిప్రాయపడింది. అంతేకాకుండా దేవర, పెద్ది సినిమాల షూటింగ్ సమయంలో తాను రోజుకు 9 గంటలకు మించి ఎప్పుడూ పని చేయలేదని స్పష్టం చేసింది.

# తాప్సీ అందాల హవా..

## సోషల్ మీడియాలో మళ్లీ సందడి

తెలుగు చిత్రసీమలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకుని, అనంతరం హిందీ చిత్ర పరిశ్రమలో అగ్ర కథానాయికగా ఎదిగిన తాప్సీ పన్ను మరోసారి వార్తల్లో నిలిచింది. అందం, అభినయం, విభిన్న పాత్రల ఎంపికతో ప్రేక్షకుల అభిమానాన్ని సొంతం చేసుకున్న ఈ నటి ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో తన తాజా చిత్రాలతో ఆకట్టుకుంటోంది. 2010లో విడుదలైన 'ఝుమ్మంది నాదం' చిత్రంతో తెలుగు ప్రేక్షకులకు పరిచయమైన తాప్సీ తొలి సినిమాతోనే మంచి గుర్తింపు పొందింది. సహజమైన నటన, ఆకర్షణీయమైన వ్యక్తిత్వంతో యువతలో ప్రత్యేక అభిమాన వర్గాన్ని ఏర్పరుచుకుంది. ఆ తర్వాత 'మిస్టర్ పర్‌ఫెక్ట్', 'గుండెల్లో గోదారి', 'సాహసం', 'ఆనందో బ్రహ్మ' వంటి చిత్రాల్లో నటించి తన ప్రతిభను చాటుకుంది. తెలుగు చిత్రాల్లో వరుస అవకాశాలు వచ్చినప్పటికీ, తాప్సీ తన కెరీర్‌ను మరింత విస్తరించాలనే లక్ష్యంతో హిందీ చిత్రసీమలోకి అడుగుపెట్టింది. అక్కడ కూడా తక్కువ కాలంలోనే తనకంటూ ప్రత్యేక స్థానం సంపాదించింది. వాణిజ్య చిత్రాలతో పాటు కథానాయిక ప్రాధాన్యమున్న చిత్రాలను ఎంపిక చేసుకుంటూ నటిగా తన ప్రత్యేకతను నిరూపించుకుంది. 'పింక్', 'బేబీ', 'ది ఘాజీ అటాక్', 'నామ్ షబానా', 'ముల్క్', 'బద్లా', 'మిషన్ మంగళ్', 'తప్పడ్', 'సాండ్ కీ ఆంఖ్', 'హసీన్ దిల్‌రుబా', 'డుంకీ' వంటి విజయవంతమైన చిత్రాల్లో నటించి విమర్శకుల ప్రశంసలు అందుకుంది. ముఖ్యంగా మహిళా ప్రధాన కథాంశాలతో రూపొందిన చిత్రాల్లో ఆమె నటనకు విశేష ఆదరణ లభించింది. ప్రస్తుతం కూడా తాప్సీ చేతిలో పలు భారీ చిత్రాలు ఉన్నట్లు సినీ వర్గాలు చెబుతున్నాయి. ఒకవైపు అగ్ర హీరోల సరసన నటిస్తూనే, మరోవైపు మహిళా కేంద్రిత కథలను ప్రోత్సహిస్తూ తన సినీ ప్రయాణాన్ని కొనసాగిస్తోంది. సినిమాలతో పాటు సామాజిక మాధ్యమాల్లోనూ తాప్సీ చురుకుగా ఉంటుంది. షూటింగ్ విరామ సమయంలో విదేశీ పర్యటనలు చేస్తూ, అక్కడి అందమైన ప్రదేశాల్లో దిగిన చిత్రాలు, వీడియోలను అభిమానులతో పంచుకుంటోంది. ఆమె పంచుకునే ప్రతి ఫొటో నెట్టింట వైరల్‌గా మారుతోంది. ఇటీవల ఆమె పంచుకున్న తాజా చిత్రాలు కూడా అభిమానులను విశేషంగా ఆకట్టుకున్నాయి. సొగసైన దుస్తుల్లో స్టైలిష్‌గా కనిపించిన తాప్సీ, తన ప్రత్యేకమైన చిరునవ్వుతో మరోసారి అందరి దృష్టిని ఆకర్షించింది. ఈ చిత్రాలపై అభిమానులు ప్రశంసల వర్షం కురిపిస్తూ, ఆమె అందం రోజురోజుకీ మరింత పెరుగుతోందని వ్యాఖ్యానిస్తున్నారు. విభిన్న పాత్రలు, బలమైన కథల ఎంపిక, అద్భుతమైన నటనతో భారతీయ చిత్రసీమలో ప్రత్యేక గుర్తింపు పొందిన తాప్సీ పన్ను, భవిష్యత్తులో మరిన్ని విజయాలను సొంతం చేసుకునే అవకాశాలు మెండుగా ఉన్నాయని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.



Printed, Published and Owned by Adula Thirupathi, and Printed at Ramani Web Offset Printers, H.No 8-82/11/1, Auto Nagar, Bommakal Road, Village, mdl & Dist : Karimnagar 505001,Telangana State, and Published from 2-5-23, Mudhiraj street,Vemulawada Town, mandal, Siricilla Dist, (Karimnagar Dist) 505302,Telangana State. Editor: Adula Thirupathi. RNI NO : TELTEL/2023/87657 Email: prajanaava@gmail.com. Phone No: 99484 33277.